వెలవెలబోయే... వెలుగులొచ్చే!



టిడ్కో గృహాల ప్రధాన రహదారి వెంట అలముకున్న అంధకారం



కూటమి అధికారంలోకి రాగానే వెలుగులు

గత తెదేపా ప్రభుత్వ హయాంలో పేదల కోసం గుడివాడలోని మల్లాయపాలెం వద్ద 9,812 టిడ్కో గృహాలు నిర్మించి దాదాపు పూర్తిచేసింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఇళ్లను పూర్తిగా పక్కన పెట్టింది. లబ్ధిదారులు, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి రావడంతో 2023 జూన్ 8న మిగిలిన పనులు చేయకుండానే లబ్ధిదారులకు అందజేసింది. ఒక్క విద్యుత్తు స్తంభానికి కూడా బల్బులు బిగించలేదు. కరెంటు సదుపాయం లేక సుమారు 10 నెలలు లబ్ధిదారులు గృహాల్లో అంధకారంలో జీవనం సాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుదీకరణ పనులు చేపట్టి టిడ్కో గృహ సముదాయంలో వీధులన్నింటికీ వెలుగులు నింపారిలా.. – ఈనాడు, అమరావతి

ఇంద్రగిరికి.. నవశోభ







13.50 లక్షల మంది వచ్చారని అంచనా

హుండీలపై రూ.9 కోట్లకు పైగా ఆదాయం

ఈనాడు, అమరావతి
న్యూస్‌టుడే, ఇంద్రకీలాద్రి

దసరా ఉత్సవాలు, భవానీల దీక్షవిరమణ సందర్భంగా ఈఏడాది రికార్డుస్థాయిలో భక్తులు తరలివచ్చారు. ఈనెల 3 నుంచి 14 వరకు.. 12 రోజుల్లో ఏకంగా 13.50 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారని అంచనా వేశారు. మూలా నక్షత్రం స్థాయిలో రెండు లక్షలకుపైగా భక్తులు ఏకంగా మూడు రోజులు పోటెత్తారు. మూలానక్షత్రంతోపాటు విజయదశమి, ఆ మరుసటి రోజూ భారీగా భక్తులు తరలివచ్చారు. ఈసారి ఆలయానికి ఆదాయం కూడా భారీగా వచ్చింది. హుండీ ఆదాయమే.. రూ.9 కోట్ల వరకూ ఉంటుందని అంచనా.

ఆదాయం అపూర్వం

దసరా రోజుల్లో ప్రతిరోజు హుండీలు నిండిపోతుండగా.. వాటిని భక్తుల దర్శనాలు రాత్రి వేళ నిలిపిన సమయంలో ఈవో, డిప్యూటీ ఈవో, ఏఈవో సమక్షంలో వీడియో తీస్తూ.. బ్యాగుల్లో నింపారు. అలా 12 రోజుల వేడుకల్లో 300 బ్యాగుల్లో డబ్బులు నింపి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు.

ధ్వజ శోభితం

కనక దుర్గమ్మకు ఈసారి కానుకలు భారీగా వచ్చాయి. ఓ దాత ఏకంగా రూ.2.50 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన కిరీటాన్ని ఇచ్చారు. ఇవికాక ఇప్పటివరకూ లెక్కించిన హుండీల్లో 412 గ్రాముల బంగారం, 16 కిలోల వెండి వచ్చింది. ఇంకా లెక్కించాల్సిన 22 హుండీల్లోనూ బంగారు, వెండి కానుకలు భారీగానే ఉంటాయని అధికారులు అంచనా వేశారు.

లడ్డూ వైభవం

దుర్గగుడి చరిత్రలోనే తొలిసారి దసరాల్లో 27లక్షలకు పైగా లడ్డూలు అమ్మారు. ముందే లడ్డూ ప్రసాదం సిద్ధం చేసి ఉంచారు. విజయదశమి, తర్వాత రెండు రోజుల్లో ముందు జాగ్రత్తగా అందరికీ ప్రసాదం అందేలా ఒక్కో భక్తునికి ఐదు లడ్డూలను మాత్రమే ఇచ్చారు. ఈసారి ఆరు లడ్డూలు కలిపి ఒక ప్యాక్‌గా అమ్మడంతో పెద్దఎత్తున కొన్నారు.

అన్న ప్రసాదం

అమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తుల ఆకలి తీర్చేలా ప్రణాళిక, కార్యాచరణతో సాగారు. అత్యంత ప్రీతిపాత్రమైన అన్నప్రసాదం, అల్పాహారం ఇచ్చారు. రెండు లక్షల మందికిపైగా భక్తులకు అన్నప్రసాదం అందించారు. 3 లక్షలుపైగా మజ్జిగ ప్యాకెట్లు.. 14 వేల లీటర్ల వేడిపాలు అందించారు.

సుజలం సుఫలం

గతంలో ఎన్నడూ లేనివిధంగా మంచినీటి బాటిళ్లను పెద్దఎత్తున అందించారు. నిరుడు వరకూ కేవలం వాటర్ ప్యాకెట్లనే ఇచ్చేవాళ్లు. ఈసారి ఏకంగా పది రోజుల్లో 19.58 లక్షల వాటర్ బాటిళ్లను అందజేశారు. దీనిపై భక్తులు కూడా సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆరా తీసి.. అన్నీ కూర్చి

వేడుకల్లో ఇబ్బందులు ఏమున్నాయనేది భక్తుల నుంచే నేరుగా కనుక్కునేందుకు ఐవీఆర్ఎస్ ద్వారా నిత్యం వేల మందికి ఫోన్ చేసి తెలుసుకున్నారు. ఆ మేరకు సమస్యలను వెంటనే పరిష్కరించగలిగారు. సాంకేతికత మేళవించి భక్తుల సంఖ్యను లెక్కించారు.

వెలుగు తోరణం

ప్రకాశం బ్యారేజీ పక్కన కృష్ణా నది తీరం నుంచి లేజర్ షో ద్వారా.. ఇంద్రకీలాద్రిపై డిజిటల్ బొమ్మలు పడేలా చేస్తూ.. అమ్మవారి చరిత్రను చెప్పిన విధానం కూడా భక్తులను ఈసారి విశేషంగా ఆకట్టుకుంది. మరోవైపు నిత్యం కృష్ణమ్మకు హారతులు ఇవ్వగా భారీగా ప్రజలు తరలివచ్చి వీక్షించి తరించారు.

సమన్వయ ఫలం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ సత్యనారాయణ పర్యవేక్షణలో.. ఈవో రామారావు, అధికారులు రాత్రింబవళ్లు ఆలయ పరిసరాల్లోనే ఉండి.. సఫలీకృతం అయ్యారు. ప్రధానంగా కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు.. నిత్య పర్యవేక్షణతో విజయవంతం చేయగలిగారు. గత పాలకుల వైఫల్యంతో వెలిసిపోయిన ఆలయాన్ని.. ఈసారి రంగులతో మెరిపించారు.

విశిష్ట సేవలు

రూ.500, రూ.300, రూ.100 టిక్కెట్ల విక్రయాలతో రూ.2.80 కోట్ల ఆదాయం వచ్చింది. 27 లక్షల లడ్డూలతో రూ.4.05 కోట్లు సమకూరింది. ప్రత్యేక కుంకుమార్చన పూజలతో ఆదాయం వచ్చింది.

ఆలయంలో 46 హుండీలు దసరాలో నిండిపోగా వాటిని బ్యాగ్‌లలో మూటకట్టి ఆలయ స్ట్రాంగ్‌రూమ్‌లో దాచారు. వాటిలో ఈనెల 16న 180 బ్యాగులను లెక్కించగా.. రూ.3.50 కోట్లు వచ్చాయి. ఈనెల 17న మిగిలిన 120 బ్యాగులను లెక్కించగా.. రూ.2.76 కోట్ల ఆదాయం వచ్చింది. ఇవికాక మరో 22 హుండీలు ప్రధాన ఆలయం పరిసరాల్లో లెక్కించాల్సినవి ఉన్నాయి. వీటిలో మరో రూ.2 కోట్లకుపైగా ఆదాయం ఉంటుందని భావిస్తున్నారు. సోమవారం ఈ హుండీలను లెక్కిస్తారు.







డ్రోన్ సమ్మిట్‌కు ఏర్పాట్లు


ఏర్పాట్లపై చర్చిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం, విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న డ్రోన్ సమ్మిట్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లుగా నగర సీపీ రాజశేఖరబాబు పేర్కొన్నారు. డ్రోన్ సమ్మిట్ కార్యక్రమం జరిగే పున్నమి ఘాట్ ప్రాంతాన్ని ఆయన అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. రాజశేఖరబాబు మాట్లాడుతూ డ్రోన్ షోతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, అతిథులు, వీఐపీలు, ప్రజలు సౌకర్యవంతంగా తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో డీసీపీ కృష్ణమూర్తినాయుడు, ఏడీసీపీ, ఏసీపీ, సిబ్బంది పాల్గొన్నారు. డ్రోన్ షో ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. 5 వేల డ్రోన్‌లతో ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కె.చైతన్య, సిటీ ప్లానర్ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్) శబరిమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ 'భారత్ గౌరవ్' పేరుతో ప్రత్యేక రైలు నడపనుంది. మొత్తం 4 రాత్రులు, ఐదు పగళ్ల ప్యాకేజీతో ఈ రైలు నవంబరు 16న సికింద్రాబాద్‌లో బయలుదేరి పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు మీదుగా శబరిమల అయ్యప్ప, చోట్టనిక్కర దేవి ఆలయాలకు చేరనుంది. 20న తిరుగు ప్రయాణమవుతుంది. టీ, అల్పాహారం, భోజనం, ఏసీ, నాన్ ఏసీ రవాణా, ప్రయాణికులకు బీమాతో కలిపి టికెట్ ధర ఒక్కొక్కరికీ స్లీపర్ తరగతిలో రూ.11,475, థర్డ్ ఏసీలో రూ.18,790, సెకెండ్ ఏసీలో రూ.24,215గా నిర్ణయించారు. వివరాలకు ఫోన్ నంబర్లు 82879 32312, 92814 95848లో సంప్రదించవచ్చు.

తోపునన్నారు.. తోక ముడిచారు!

- ఇళ్ల నిర్మాణం చేపట్టలేక పలాయనం
- డ్వాక్రా రుణం రూ.9.80 కోట్లు స్వాహా
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే సంస్థ నిర్వాకం
- అయినా... విచారణ పేరిట కాలక్షేపమేనా?



ఈ చిత్రం చూశారా..? ఇవీ జగనన్న కాలనీ పేరుతో పేదలకు నిర్మిస్తున్న ఇళ్లు. జగన్ జమానాలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తానే పేదలకు ఇళ్లు కట్టిస్తానని ముందుకు వచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఆయన సంస్థకు ఇళ్ల నిర్మాణం అప్పగించారు. విజయవాడ సెంట్రల్‌లో పల్లవానితిప్ప లేఔట్‌లో ఎమ్మెల్యే సంస్థకు నాలుగు వేల ఇళ్లను అప్పగించారు. నాలుగేళ్లు గడిచినా.. నేటికీ మొండి గోడలే ఉండటంతో లబ్ధిదారులు అల్లాడుతున్నారు. వీటిని పూర్తి చేయడానికి ఎవరూ రావడం లేదు. ఇప్పటికే రూ.కోట్ల బిల్లులు తీసుకున్న తోపుదుర్తి పత్తా లేరు. ప్రస్తుతం విజిలెన్సు విచారణ చేపట్టారు. ఎన్నిసార్లు ఎమ్మెల్యే సంస్థకు నోటీసులు ఇచ్చినా.. సమాధానం లేదు.

ఈనాడు, అమరావతి

వైకాపా ఏలుబడిలో అప్పటి రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి సంస్థ.. రాక్రీడ్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ జగనన్న ఇంటి లబ్ధిదారులకు మొండిచేయి చూపింది. తక్కువ సొమ్ముకే ఇళ్లు నిర్మిస్తామని నమ్మబలికి అసలుకే ఎసరు పెట్టింది. సిమెంటు, స్టీలు, ఇసుక.. తీసుకుని పత్తా లేకుండాపోయింది. ఒక ఇంటిని రూ.1.80 లక్షలకే కట్టిస్తానని ఒప్పందం చేసుకుని తర్వాత మాట మార్చి మరో రూ.35 వేలు తీసుకుంది. రూ.2.15 లక్షలు చేసి.. వారికి మాత్రమే పునాదుల వరకు కట్టింది. తమకు ఇళ్లు కట్టిస్తామని డబ్బు తీసుకున్న రాక్రీడ్ తమను మోసం చేసిందని.. లబ్ధిదారులు కలెక్టరేట్‌లో స్పందనలోనూ ఫిర్యాదులు చేశారు.

20 వేల ఇళ్లని గొప్పలు...

ఉమ్మడి జిల్లాలో 20 వేల ఇళ్లను.. ఒక్కో యూనిట్ రూ.1.80 లక్షలకే కట్టిస్తానని ఒక్క ఇంటినీ పూర్తి చేయలేదు. రాక్రీడ్ సంస్థకు ఇచ్చిన బిల్లులు వెనక్కి తీసుకునేందుకు గృహనిర్మాణ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నాడు పెద్దలు ఆదేశించడం తరువాయి.. పురోగతి చూడకుండా బిల్లులు మంజూరు చేశారు. నున్న లేఔట్‌లో 4,800 ఇళ్లు, పల్లవానితిప్పలో 4 వేల ఇళ్లను తొలిగా అప్పగించారు. వీటిలో నున్నలో 1600, పల్లవానితిప్పలో 1,200 ఇళ్లను ప్రారంభించారు. నున్నలోవి గన్నవరం.. పల్లవానితిప్పలోవి సెంట్రల్ లబ్ధిదారులకు ఇవ్వాల్సినవి. రెండుచోట్లా పునాదుల వరకు నిర్మించారు. లబ్ధిదారులకు రూ.35 వేల డ్వాక్రా రుణం ఇస్తే వాటిని గుత్తసంస్థ తీసుకుంది. డ్వాక్రా రుణం రూ.9.80 కోట్లు నేరుగా రాక్రీడ్ సంస్థకు చెల్లించారు. అవేకాక.. పునాదుల వరకు వచ్చే రుణం రూ.6.22 కోట్లు బిల్లుల కింద తీసుకున్నారు. ప్రతి ఇంటికి మొదటి దశలో ఇచ్చే సిమెంటు, స్టీలు, ఇసుక తీసుకున్నా 2,800 గృహాలను పునాదుల వరకు లేపి తర్వాత వదిలేశారు. ఆపై యూనిట్ వ్యయం రూ.2.15 లక్షలకు పెంచి.. మళ్లీ కడతామని ముందుకు వచ్చినా పూర్తి చేయలేదు. పలుమార్లు సంస్థకు నోటీసులు ఇవ్వగా... పునాదులపై మూడడుగుల గోడ లేపి.. పిల్లర్లు వేయకుండా వదిలేశారు. ఇప్పటికే ఇసుక, ఇనుము, కంకర, కొంతమేర బిల్లులు తీసుకొన్నారు. 2,800 ఇళ్లకు ఇప్పటికి 20 శాతం బిల్లులు చెల్లించారు. రూ.35 వేల చొప్పున రూ.9.80 కోట్లు తీసుకున్నారు. బిల్లులు, ఇసుక, కంకర.. ఇతర రూపంలో మరో రూ.15 కోట్లు చెల్లించారు.

ఉడాయించిన సంస్థ..!


ఇటుకల యూనిట్ తరలించిన ప్రదేశం ఇదే

నున్న లేఔట్‌లో ఒక సిమెంటు ఇటుక తయారీ ఫ్యాక్టరీ పెట్టారు. అక్కడ లబ్ధిదారులకు చెందిన సిమెంటు, కంకర తరలించారు. ఇటుకలు తయారు చేయలేదు. ఇటీవల ఈ ఫ్యాక్టరీని తరలించారు. ఆ పేరుతో సిమెంటు భారీగా దుర్వినియోగమైంది. పనుల తీరు.. మంజూరు చేసిన బిల్లులపై నివేదిక రూపొందించగా ఏమాత్రం పొంతన లేదు. గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయం నుంచే నేరుగా బిల్లులు చెల్లించారని ఓ అధికారి చెప్పారు. ప్రభుత్వం మారాక విజిలెన్సు విచారణ జరుగుతోంది. హౌసింగ్ ఇన్‌ఛార్జి పీడీ కపూర్‌ను వివరణ కోరగా.. విజిలెన్సు విచారణ జరుగుతోందనీ, అసంపూర్తి గృహాల పూర్తికి ఎవరూ ముందుకు రావడం లేదని వివరించారు.

ఉల్లాస్‌పై ప్రత్యేక దృష్టి: జేసీ

కృష్ణలంక: పదిహేనేళ్ల పైబడిన వారిలో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్ది.. ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత పెంచేందుకు ఉద్దేశించిన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమం అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్, జేసీ నిధి మీనా ఆదేశించారు. శుక్రవారం ఉల్లాస్ అమలుపై ఆమె కీలక శాఖల అధికారులతో సమీక్షించారు. పథకం లక్ష్య సాధనకు అధికారులు కృషి చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆయాలు, కుక్‌లు, హెల్పర్లు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్‌వాడీ సహాయకులు తదితరుల్లో నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని చెప్పారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో ఎంపీడీవో ఛైర్మన్‌గా కమిటీలు పని చేస్తాయని తెలిపారు. కార్యక్రమం మూడేళ్లపాటు జరుగుతుందని, తొలిదశలో 7 వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్, క్లస్టర్ కోఆర్డినేటర్లతో సర్వే చేసి నిరక్షరాస్యులను గుర్తించాలన్నారు. ప్రతి పది మందికి ఒక వాలంటీర్ టీచర్‌ని ఉండాలని తెలిపారు. వారికి జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇవ్వాలని, నవంబరు 1 నుంచి సాయంత్రం రెండు గంటల పాటు తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. తరగతులు పూర్తయిన అనంతరం అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమం నోడల్ అధికారి జి.ప్రసాదరావు, ఏపీవో ఎం.సింగయ్య, డీఈవో యూవీ సుబ్బారావు, ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డీపీఆర్‌వో మోహనరావు, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ సభకు సన్నాహాలు


సీపీ రాజశేఖరబాబుకు సూచనలిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో ఈ నెల 21వ తేదీన పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావు, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు స్టేడియంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వీవీఐపీలు/వీఐపీలు హాజరుకానున్న సందర్భంగా స్టేడియంలో కట్టుదిట్టమైన భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, భద్రతా పరంగా చిన్న లోపం కూడా లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పోలీస్ పరేడ్‌ను పర్యవేక్షించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ ఐజీ శ్రీకాంత్, డీఐజీలు రాజకుమారి, అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విడిపోలేక.. వీడిపోయారు

ప్రేమజంట బలవన్మరణం


తమ ప్రేమకు గుర్తుగా పచ్చబొట్టు చూపిస్తున్న శైలు, మహేష్ (పాతచిత్రం)

పెదకాకాని, నందిగామ, న్యూస్‌టుడే: వారి అభిరుచులు కలిశాయి.. మనసులు కలిశాయి.. ప్రేమతో చేరువై.. ఏడు అడుగులతో ఒక్కటై.. కలకాలం కలిసి జీవించాలని కలలు కన్నారు. వీరి ప్రేమకు గుర్తుగా ఒకరి చేతిపై మరొకరి పేరు పచ్చబొట్టు వేయించుకున్నారు. ప్రేమ, పెళ్లి విషయం పెద్దల దృష్టికి తీసుకెళ్లగా సమ్మతించలేదు. కల చెదిరిందని తలచారు.. కలిసి ఉండలేమని తల్లడిల్లారు. విడిపోలేక.. ఏకంగా లోకాన్నే వీడి వెళ్లిపోయారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని కన్న వారికి పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చారు. ఈ విషాద ఘటన గుంటూరు జిల్లా పెదకాకానిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. రైల్వే పోలీసులు, స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. పెదకాకానికి చెందిన దానబోయిన సాంబశివరావు, సామ్రాజ్యం చిన్న కుమారుడు మహేష్ (22), నందిగామ మండలం రుద్రవరానికి చెందిన నంద్రు వెంకయ్య (లేటు), విజయల చిన్న కుమార్తె శైలజ (20) రెండేళ్ల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సెల్ షోరూంలో పనిచేశారు. వారి పరిచయం ప్రేమగా మారింది. కొన్ని నెలల కిందట ప్రేమ విషయం వారు పెద్దలకు చెప్పగా పెళ్లికి నిరాకరించారు. అతను డిప్లొమో చేయగా.. ఆమె ఇంటర్ చదువుకుంది. ఇటీవల శైలజ గుంటూరు వచ్చి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా, మహేష్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. యువతి స్థానికంగా గది అద్దెకు తీసుకొని ఉంటోంది. మహేశ్ కొన్ని రోజుల కింద ఇంటి నుంచి బయటకు వచ్చి ఆమెతో కలిసి ఉంటున్నారు. కుమారుడు ఇంటికి రాకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో 'మహేష్ నీకు నచ్చినట్లు, నువ్వు చెప్పినట్లు చేస్తాను' అని తండ్రి వాయిస్ మెసేజ్ పంపారు. 'నేను శుక్రవారం సాయంత్రం వస్తాను' అని మహేశ్ సమాధాన సందేశం ఇచ్చారు. మరోవైపు ఈ నెల 10న తన సోదరికి శైలజ ఫోన్ చేసి ఇంటికి వస్తున్నట్లు తెలిపారు. 15 వరకు రాకపోవడంతో ఈ నెల 16న తన కుమార్తె కనిపించటం లేదని నందిగామ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి గుంటూరు కొత్తపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయం వారికి తెలియడంతో పెద్దలు తమ పెళ్లి చేయరని భావించి మనస్తాపంతో పెదకాకాని శివారులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. అంతకు ముందు యువతి తన తల్లికి ఫోన్ చేసి పెదకాకాని రావాలని చెప్పి ఫోన్ కట్ చేసింది. రైల్వే పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


విజయవాడ ఆర్టీసీ బస్టాండు ముందు..


బందరు రోడ్డులో..

కళ్లు తెరవండి

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విజయవాడ నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. గాలిలో కాలుష్యం ఎంతమేర ఉందో వీటిల్లో ప్రదర్శించాల్సి ఉంది. గాలిలో తేమ, విషవాయువుల శాతం, శబ్ద తీవ్రత తెలుసుకుని అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే పీఎన్‌బీఎస్, దుర్గా ఘాట్, బందరురోడ్డు, పాలిక్లినిక్ రోడ్డు ప్రాంతాల్లో ఈ బోర్డులు పనిచేయకపోవడంతో కాలుష్యం ఎంత ఉందో నగరవాసులకు తెలియడం లేదు. వీటిని బాగు చేయాల్సి ఉంది. -ఈనాడు, అమరావతి

ఒక్కటీ.. కనిపించవేవీ ?


ప్లాట్‌ఫాం 17 వద్ద టీవీ ఉన్నా..ప్రకటనల బోర్డు పెట్టి..


ప్లాట్‌ఫాం 48 ప్రాంతంలో ఇలా...

విజయవాడ పీఎన్‌బీఎస్‌లో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించే సమయంలో కాలక్షేపం చేద్దామంటే టీవీలు తగినన్ని లేవు. మరమ్మతులు లేక గురవడంతో ఉన్న టీవీలను తొలగించారు. అక్కడక్కడ ఉన్నా.. వాటిని వాణిజ్య ప్రకటనల బోర్డులుగా వాడుతున్నారు. ఆర్టీసీ పరిపాలన భవనం కింద ఉండే బస్టాండ్లో టీవీలే లేవు. టీవీలు అమర్చి.. వినోద కార్యక్రమాలు ప్రసారం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతో అభివృద్ధి పనులు


మధురానగర్ ఆర్‌యూబీ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

మధురానగర్, న్యూస్‌టుడే: మధురానగర్ వాసుల చిరకాల వాంఛ అయిన ఆర్‌యూబీని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మధురానగర్ ఆర్‌యూబీని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధిలో తాను కూడా భాగస్వామిని అవుతున్నానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో అభివృద్ధి పనులను శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. విజయవాడలో రైల్వేతో అనుసంధానమైన పనులు అనేకం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తి చేసేందుకు వీఎంసీ, రైల్వే అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. దీని కోసం జాయింట్ కమిటీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైల్వేతో ఉన్న భూ సమస్యలను త్వరలో ఆశాఖ అధికారులతో మాట్లాడతామని తెలిపారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ తెదేపా హయాంలోనే ఆర్‌యూబీ నిర్మాణానికి శంకుస్థాపన చేశానని గుర్తు చేశారు. వైకాపా ప్రభుత్వం సకాలంలో నిర్మించకుండా కాలయాపన చేసి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. 9 నెలల కాలంలో పూర్తి చేయాల్సిన దానిని నిర్మించేందుకు 5 సంవత్సరాల కాలం తీసుకున్నారని పేర్కొన్నారు. గుణదల వద్ద ఆగిపోయిన వంతెన పనులను కూడా త్వరలో పూర్తి చేస్తామని, వాంబేకాలనీ వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వీరమాచినేని లలిత, కొంగితల లక్ష్మీపతి, కూటమి నాయకులు బొలిశెట్టి వంశీకృష్ణ, నవనీతం సాంబశివరావు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, నెక్కంటి ప్రసాద్, సింగం వెంకన్న, అంగిరేకుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లోనే శిక్షణ ఇవ్వండి


డీఈవో సుబ్బారావుకు వినతి పత్రాన్ని అందిస్తున్న పీఆర్టీయూ నేత రాఘవరాజు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని విజయవాడ ఎంజీ రోడ్డులోని కార్యాలయంలో ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావును పీఆర్టీయూ కార్యనిర్వాహక అధ్యక్షుడు సోలా రామచంద్రరాజు కలిసి వినతిపత్రాన్ని అందించారు. మెడికల్ సెలవులు సెటిల్‌మెంట్ కాని వారిని పరిష్కరించాలని, ఉపాధ్యాయుల సర్వీస్ క్రమబద్ధీకరణ పోలీస్ విచారణతో సంబంధం లేకుండా చేయాలని, ఒకటి, రెండు తరగతుల బోధించే ఉపాధ్యాయుల శిక్షణను మండల కేంద్రంలో నిర్వహించాలని తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వాటిని విద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఈవో హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సంచాలకుడికి వినతి

గాంధీనగర్: పశుసంవర్ధక శాఖ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి. శివారెడ్డి, సి.హెచ్. పురుషోత్తం నాయుడు కోరారు. పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన దామోదర నాయుడును వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఉద్యోగుల తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, రంగారావు, డి.వి. రమణ, కృష్ణారెడ్డి, రాజ్యలక్ష్మి, రామకృష్ణ, రవిశంకర్, మదీనా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే కార్మిక వర్గానికి న్యాయం


మాట్లాడుతున్న బాలన్, సదస్సులో ప్రసాద్, ఏసు, వెంకటేశ్వర్లు తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో దోపిడీ సాగితే.. మోదీ ప్రభుత్వంలో బందిపోటు దోపిడీ సాగుతోందని కార్మిక నేత, కర్ణాటక హైకోర్టు న్యాయవాది బాలన్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉభయ ఐఎఫ్‌టీయూ సంస్థలు విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో రెగ్యులర్ ఉద్యోగ, కార్మికుల సంఖ్య 15 శాతానికి తగ్గితే.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఖ్యను 85 శాతానికి పెంచారని పేర్కొన్నారు. కార్పొరేటర్లకు దోచిపెట్టడానికి నాలుగు లేబర్ కోడ్లను మోదీ ప్రభుత్వం తెచ్చిందని అన్నారు. కార్మిక వర్గానికి న్యాయం జరగాలంటే సంఘాల నిర్మాణం చేపట్టడం, పోరాటాలు చేయడం తప్పించి మరో మార్గం లేదని స్పష్టం చేశారు. తొలుత విప్లవ మేధావి ప్రొఫెసర్ సాయిబాబా మృతికి మౌనం పాటించారు. లేబర్ కోడ్లు, నేర చట్టాల రద్దు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వరద బాధితులందరికీ పరిహారం తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్, సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఏపీ ప్రగతిశీల అంగన్వాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.భారతి తదితరులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

శనివారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
కాలేజి స్టైల్	సా. 5 - రా. 9
ఈ స్టార్ మీ స్టార్	రా. 9 - రా. 10
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 10 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 132, 141, 152 చికెన్ విత్ స్కిన్ - 254 చికెన్ స్కిన్‌లెస్ - 264.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 510 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా నేడు


కరపత్రాలు ఆవిష్కరించిన మనోహర్‌కుమార్, శ్రీనివాసరావు, సుందరయ్య తదితరులు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఉదయం ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్నట్లు ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య తెలిపారు. శుక్రవారం గవర్నర్‌పేటలోని యూటీఎఫ్ హాలులో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ నగరపాలకసంస్థ పాఠశాలల్లో ఎస్‌జీటీ పోస్టుల అప్‌గ్రేడేషన్, పదోన్నతులు, బదిలీలు, పీఎఫ్ ఖాతాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పి. మనోహర్‌కుమార్, జిల్లా కోశాధికారి పి. నాగేశ్వరరావు, నాయకులు ఎ.గోపాలకృష్ణ, ఎ.భరత్, ఎస్.ఆర్. హెచ్.దేవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ ఛార్జీల భారం మోపొద్దు


సీపీఎం నాయకుల నిరసన

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై రూ. 8,114 కోట్ల భారం మోపేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోందని, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఆందోళన చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు సీహెచ్ బాబూరావు హెచ్చరించారు. ట్రూఅప్ ఛార్జీల భారం మోపొద్దు అంటూ శుక్రవారం రమేష్ హాస్పటల్ కూడలిలోని విద్యుత్తు నిలయం వద్ద సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యుత్తు ఛార్జీలు పెంచి ప్రజలను దోచేశారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఛార్జీలు పెంచమని కూటమి నాయకులు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. భారం పెంచవద్దని విద్యుత్తు నియంత్రణ మండలికి ప్రభుత్వం లేఖ రాయాలని సూచించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు దోనేపూడి కాశీనాథ్, బోయ సత్యబాబు, జిల్లా కమిటీ సభ్యులు బి.రమణ, పి.కృష్ణ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంటూరు, న్యూస్‌టుడే: బీఎస్సీ (హానర్స్) కమ్యూనిటీ సైన్స్ కోర్సులో ఎన్‌ఆర్‌ఐ కోటా కింద 3వ దశలో ప్రవేశాలకు ఈనెల 22, 23 తేదీల్లో ఉదయం 10 గంటలకు గుంటూరుకు సమీపంలోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవన్ లాంలో మాన్యువల్ కౌన్సెలింగ్ ఏర్పాటు చేశామని వర్సిటీ రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు దరఖాస్తు చేయని అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

కోర్టు విచారణకు వచ్చి పరారీ

సూర్యారావుపేట: చెక్కు బౌన్స్ కేసులో కోర్టు విచారణకు హాజరై ఎవరికీ చెప్పకుండా పరారైన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురానికి చెందిన రాంకుమార్ చెక్కు బౌన్స్ కేసులో నిందితుడు. ఇతను కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో వారెంటు జారీ అయ్యింది. దీంతో భవానీపురం పోలీసులు ఇతనిని న్యాయస్థానానికి తీసుకువచ్చారు. విచారణ జరగాల్సిన సీఎంఎం కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండడంతో రెండో అదనపు ముఖ్య మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. వారెంట్ రీకాల్ చేసుకుంటామని రాంకుమార్ తరపు న్యాయవాది చెప్పడంతో న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. ఈ విషయమై ఇరువర్గాలు మాట్లాడుకుంటుండగా రాంకుమార్ అక్కడ నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. దీనిపై అతనిని తీసుకు వచ్చిన భవానీపురం కానిస్టేబుల్ డి.రామారావు సూర్యారావుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? కొండపల్లి చెన్నకేశవ, రామాలయం నుంచి పొట్టి శ్రీరాములు మార్కెట్ సెంటర్‌కు వెళ్లే దారిలో కల్వర్టుపై ఉన్న రాళ్లు పగిలిపోయాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు దానిని దాటుకొని వెళ్లే క్రమంలో పడిపోతున్నారు.
- యండ్రాల గోపి, స్థానికుడు

✓ అక్కడ చిన్నపాటి నాపరాళ్లు గతంలో ఏర్పాటు చేశారు. అవి పగిలిపోయాయి. సిమెంటు బిళ్లలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. - కమిషనర్ పి.శ్రీనివాస్
- న్యూస్‌టుడే, కొండపల్లి

స్పందనకు వందనం

● స్థానిక పంచాయతీలోని ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలోని మురుగు కాల్వలో పూడిక నిండి మురుగునీరు రోడ్డుపైకి చేరుతున్న సమస్యను స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కార్యదర్శి రఫి స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో తూము వద్ద నిండిన పూడికను తొలగించి, మురుగు పారుదలకు చర్యలు తీసుకున్నారు.
- న్యూస్‌టుడే, మైలవరం

● పట్టణంలోని 6వ వార్డు సచివాలయం పరిధిలో 10వ వార్డులోని పేట రామారావు రోడ్డులో చెత్త ఉందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

● పట్టణంలోని 8వ వార్డు సచివాలయం పరిధిలో 15వ వార్డులో మురుగు నీరు పారుదలకు కాల్వ అవసరమని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో కొత్త కాల్వ ఏర్పాటు చేయించారు.

● పట్టణంలోని 4వ వార్డు సచివాలయం పరిధిలో 9వ వార్డులోని వీధుల్లో పిచ్చి చెట్లు పెరిగి ఆవరించుకుపోయాయని స్థానికులు మేమున్నాం...మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో తొలగింపజేశారు.

● పట్టణంలోని 10వ వార్డు సచివాలయం పరిధిలో 19వ వార్డులో కాల్వల్లో మురుగు, చెత్త పేరుకుపోయిందని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సమస్య పరిష్కరించారు.
- న్యూస్‌టుడే, తిరువూరు

ఆంధ్రరత్న బిరుదుకు ఎంపిక


పెదగమళ్ల నాగరాజు

జి.కొండూరు, న్యూస్‌టుడే: గంగినేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు పండితుడిగా సేవలందిస్తున్న డాక్టర్ పెదగమళ్ల నాగరాజు ఆంధ్రరత్న బిరుదుకు ఎంపికయ్యారు. ఈ విషయమై అఖిల భారత సాంస్కృతిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.విజయ్‌కుమార్ నుంచి ఆయనకు ఆహ్వానం అందినట్లు నాగరాజు ఓ ప్రకటనలో విలేకరుల సమక్షంలో వెల్లడించారు. ఈ నెల 21వ తేదీన విజయవాడలో జరిగే బహుమతి ప్రదానోత్సవంలో ఈ అవార్డు అందుకుంటానని తెలిపారు. తెలుగు భాషకు చేస్తున్న సేవలను గుర్తింపుగా గురు బ్రహ్మ అవార్డు దక్కిందని, ఇదే క్రమంలో నేడు ఆంధ్రరత్న అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీ.రామకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్థులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

మధిరశాఖ కాల్వకు 763 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు శుక్రవారం కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి 763 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 232 క్యూసెక్కులు చేరాయని, దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు 35, పెదకొమిర 20, మధిర 10, నిదానపురం 20 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మూడు మండలాల్లో పల్లె పండగ నేడు

ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: ఎ.కొండూరు మండలంలో రేపూడి, గొల్లమందల, కంభంపాడు, కోడూరు, మారేపల్లి, పోలిశెట్టిపాడు, గోపాలపురం, జీళ్లకుంట, వల్లంపట్ల గ్రామాల్లో శనివారం జరిగే పల్లె పండగ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పాల్గొని సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారని ఎంపీడీవో పి.హరిప్రియ తెలిపారు. అనంతరం తిరువూరు మండలంలో మధ్యాహ్నం నుంచి వావిలాల, పెద్దవరం, ఎర్రమాడులో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీడీవో పీవీఎస్.నాగేశ్వరరావు పేర్కొన్నారు. గంపలగూడెం మండలంలో సాయంత్రం నుంచి గుళ్లపూడి, సొబ్బాల, లింగాలలో జరిగే సీసీ రోడ్ల శంకుస్థాపనకూ హాజరవుతారని ఈవోపీఆర్డీ డి.బాబూరావు తెలిపారు.

భవనం.. శిథిలం.. భయం

కూలేందుకు సిద్ధంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయం

పెచ్చులు ఊడిపోతున్న పైకప్పు, పిల్లర్లు

జి.కొండూరు, న్యూస్‌టుడే

జి.కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో 1999వ సంవత్సరంలో మండల పరిషత్ కార్యాలయాన్ని నిర్మించి ప్రారంభించారు. నేడు అది శిథిలావస్థకు చేరుకుంది. తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. భవనాన్ని కూల్చి నూతన భవనం పటిష్ఠంగా నిర్మిస్తేనే మనుగడ ఉంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండతస్తులుగా నిర్మించిన భవనం సమావేశాలు నిర్వహించే గదిలో వర్షపు నీరు లీకవుతుండడంతో 2017లో మరమ్మతులు చేశారు. దీంతో కొంత కాలం ఇబ్బంది లేకుండాపోయింది.


మండల పరిషత్ కార్యాలయం


సమావేశం గదిలో ఇలా..


పూర్తిగా పగిలిపోయిన ఎలివేషన్ పిల్లర్లు

భయంగానే విధులు

ఇటీవల కొద్ది నెలలుగా సమావేశపు గదిలో పైకప్పు పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో కొద్దిపాటి వర్షానికే సమావేశపు గదిలో వర్షపునీరు కారుతోంది. అంతేకాక భవనం పిల్లర్లు సైతం పెచ్చులూడి పడిపోతున్నాయి. దీంతో కార్యాలయంలో పని చేసే సిబ్బంది దినదిన గండంగా పనిచేస్తున్నారు. ఏ సమయంలో భవనం పడుతుందోనని భయాందోళన చెందుతూ విధులు నిర్వహిస్తున్నామని వాపోతున్నారు. కొద్ది నెలల కిందట పాత భవనాన్ని కూల్చి.. నూతన భవనం నిర్మించేందుకు జిల్లా పరిషత్ ఉన్నతాధికారులకు నివేదించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పడితే నూతన భవనం నిర్మాణానికి మరి కొంత సమయం పట్టవచ్చు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.


పగుళ్లిచ్చిన కార్యాలయం స్తంభాలు

ప్రత్యేక ఆధార్ శిబిరాలు

మైలవరం, న్యూస్‌టుడే: ఈ నెల 22వ తేదీ నుంచి మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.అనురాధ తెలిపారు. 22న మైలవరం ప్రజలకు 2వ గ్రామ సచివాలయం, వెల్వడం ఎంపీయూపీ పాఠశాలలో, 23న పొందుగల పంచాయతీ కార్యాలయం, తోలుకోడు పంచాయతీ కార్యాలయంలో, 24న పుల్లూరు, మొర్సుమిల్లి ప్రజలకు పుల్లూరు హైస్కూల్లో, గణపవరం సచివాలయంలో, 25న చంద్రగూడెం సచివాలయంలో, కీర్తిరాయుని గూడెం, చంద్రాల సచివాలయాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

జి.కొండూరు, న్యూస్‌టుడే: నెలవారీ మరమ్మత్తుల నిమిత్తం జి.కొండూరు, కుంటముక్కల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు సరఫరా ఉండదని ఆ శాఖ సహాయక ఇంజినీరు సీహెచ్.రామ్మోహనరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వరద సాయం అందించండి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మూలపాడు బీసీ కాలనీ వాసులను కృష్ణా వరద ముంచెత్తింది. అయితే నష్టపరిహారం అతి కొద్ది మందికి మాత్రమే అందిందని, తాము అన్ని విధాలా నష్టపోయామని కాలనీ వాసులు తహసీల్దారు వెంకటేశ్వర్లును కోరారు. మొత్తం 168 కుటుంబాలకు సాయం అందలేదని ఆదుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

నెమలి, ఊటుకూరు, కనుమూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి, ఉమ్మడిదేవరపల్లి, కనుమూరు, ఊటుకూరు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన శిబిరాల్లో పశువైద్యాధికారులు డి.అభిలాష్, జి.సాయికృష్ణ, శిరీష పాల్గొని 3,775 గొర్రెలు, 987 మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఉచితంగా అందిస్తున్న ఈ సౌకర్యాన్ని జీవాల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం పుట్రేలలో శిబిరం నిర్వహిస్తామన్నారు.

తిరువూరు : మండలంలోని వావిలాల గ్రామంలో శుక్రవారం 195 గొర్రెలు, 85 మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు వేసినట్లు పశువైద్యాధికారిణి టి.శ్వేత, వీఎల్వో ఎం.గోపాలకృష్ణ తెలిపారు. గొర్రెల సంఘం అధ్యక్షుడు ఆర్.నరసింహారావు పాల్గొన్నారు. శనివారం మల్లేలలో శిబిరం నిర్వహిస్తామన్నారు.


గంపలగూడెం : గొర్రెలకు మందు తాగిస్తున్న పశువైద్యాధికారి అభిలాష్

మా సమస్యలు గాంధీ మార్గంలో పరిష్కరించుకుంటాం

ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం), న్యూస్‌టుడే: మా సమస్యలను గాంధీ మార్గంలోనే పరిష్కరించుకుంటామని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ సభ్యులు అన్నారు. కాంట్రాక్టు కార్మిక సమస్యల పరిష్కారానికి యూనియన్ రాష్ట్ర కమిటీ నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ మేరకు సంస్థలో పనులు చేస్తున్న యూనియన్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం విధులకు హాజరై.. ముందుగా మౌనం పాటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ గతంలో అనేక సార్లు జెన్‌కో కార్మిక సమస్యను తెలియజేశామని.. ప్రభుత్వాలు మారుతున్నా ఇంత వరకు ఎటువంటి పరిష్కారం లేదన్నారు. పనికి తగ్గ వేతనం రావడంలో, కనీస వేతనం పొందడంలో విఫలమయ్యామన్నారు. రెండో రోజు మరో దశలో నిరసన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో షంషేర్‌వలీ, చంద్రశేఖర్, తంబికుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలతో యూనియన్ సభ్యుల నిరసన

సృజనాత్మకత వెలికితీతకు ఇ- జర్నల్స్ దోహదం

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీతకు ఇ- జర్నల్స్ దోహదపడతాయని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఈ జర్నల్‌ను శుక్రవారం మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రిన్సిపల్, ఎడిటర్ ఇన్ చీఫ్ ఇల్లా రవి మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివే విద్యార్థుల్లో పరిశోధనా పద్ధతులు అలవాటు చేయడం, వారిలో కలిగే సందేహాలను నివృత్తి చేయడం జర్నల్ ముఖ్య ఉద్దేశమన్నారు. మూడు నెలలకు ఒకసారి ఈ మ్యాగజైన్ విడుదలవుతుందని ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎం.దేవానంద్ తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఇ- జర్నల్ ఆవిష్కరణలో జేడీ సీహెచ్ కృష్ణ, ప్రిన్సిపల్ ఇల్లా రవి, అధికారులు

ట్రూఅప్ ఛార్జీల భారం వేయొద్దు: సీపీఎం

మైలవరం, న్యూస్‌టుడే: విద్యుత్తు ట్రూఅప్ ఛార్జీలు, సర్‌ఛార్జీల పేరిట ప్రజలపై భారం మోపొద్దని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు, కోట కల్యాణ్ డిమాండ్ చేశారు. ట్రూఅప్ ఛార్జీల ప్రతిపాదనలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ట్రూఅప్ పేరిట రూ.8 వేల కోట్లకు పైగా భారాన్ని మోపేందుకు సిద్ధ పడుతున్నారని, తక్షణమే ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతున్నారని, వాటిని తగ్గించే ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రమేష్, పౌలు, రాజారెడ్డి, స్వామి, సురేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ట్రూఅప్ ఛార్జీలు నిలిపివేయాలంటూ ఇబ్రహీంపట్నం రింగుకూడలి వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, విఠలరావు, బేబీ సరోజని, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల పేరుతో విద్యుత్తు వినియోగదారులపై ఆర్థిక భారం మోపేందుకు సిద్ధమైందని సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు ఆరోపించారు. శుక్రవారం విస్సన్నపేటలో ప్రధాన రహదారిపై సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ధర్నా చేశారు.

తిరువూరు, న్యూస్‌టుడే: ట్రూఅప్ ఛార్జీల పెంపుదలను రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని సీపీఎం నాయకులు పట్టణంలోని బోసుబొమ్మ కూడలిలో ఆందోళన నిర్వహించారు. నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి, జి.వెంకటరత్నం, ఎస్వీ.భద్రం, బి.వెంకటేశ్వరరావు, ఎ.రవి, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే: కంభంపాడులో శుక్రవారం సీపీఎం నాయకులు ధర్నా చేశారు. సీపీఎం మండల కార్యదర్శి జె.వెంకటేశ్వరరావు, నాయకులు పి.ఆనందరావు, ఆర్.రామకృష్ణ, పి.వెంకటేశ్వరరావు, లక్ష్మయ్య, యోహాను, ఆంజనేయులు, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.


మైలవరంలో సీపీఎం నాయకులు, కార్యకర్తల ధర్నా



తిరువూరు బోసుబొమ్మ కూడలిలో నిరసన



ఇబ్రహీపట్నంలో నినాదాలు చేస్తూ..

ఉచిత ఇసుక సరఫరా చేయాలి

తిరువూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఇసుక కొరతతో ఉపాధి కొరవడిన భవన నిర్మాణ కార్మికులు కుటుంబ పోషణకు నానా కష్టాలు పడుతున్నారన్నారు. అనంతరం తమ డిమాండ్ల వినతిపత్రాన్ని ఆర్డీవో మాధురికి అందజేశారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే.నాగుల్‌మీరా, సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎం.ఉదయ్, ఎస్‌కే.సుభాని, యాకూబ్, మస్తాన్, బి.వెంకటేష్, ఎం.నరసింహ, పి.సునిల్ బి.అశోక్ తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని కవులూరులో భోగినేని రాజగోపాలరావు పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయి షటిల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. మైలవరం ఎల్‌బీఆర్‌సీ ఇంజినీరింగ్ కళాశాల ఇండోర్ మైదానంలో నియోజకవర్గ స్థాయిలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్-14 విభాగంలో లోహిత, అండర్-17 విభాగంలో అమృత ఉత్తమ ప్రతిభచూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఓ.నాగేంద్రరావు వారికి అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో పి.హరిప్రియ తెలిపారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ కె.నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఎంపీటీసీలు, సర్పంచులు కూడా గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. జడ్పీటీసీ సభ్యుడు బి.గనియా, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు తమ గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులపై ఈవోపీఆర్డీ సరస్వతి, తాగునీరు సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీలక్ష్మి, సీసీ రహదారుల నిర్మాణ నిధులపై ఏపీవో రామారావు, తల్లికి వందనం అమలుపై ఎంఈవో-2 కేశవరావు సభ్యులకు వివరించారు.

ఎంపీని కలిసిన జనసేన నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఎంపీ కేశినేని శివనాథ్‌ను జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి అక్కల రామ్మోహనరావు, జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను శుక్రవారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.

స్వర్గపురి వాహనం కొనుగోలుకు రూ.లక్ష విరాళం

తిరువూరు: స్థానిక పోతుల చెరువు వద్ద తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (తోసా) ఆధ్వర్యంలో నిర్మించిన స్వర్గపురికి భౌతికకాయాలు తరలించేందుకు అవసరమైన వాహనం కొనుగోలుకు పట్టణానికి చెందిన దారా నారాయణమూర్తి తన భార్య ధనలక్ష్మి జ్ఞాపకార్థం శుక్రవారం రూ.లక్ష విరాళం అందజేశారు. విరాళం అందుకున్న తోసా సభ్యులు దాత అతడి కుమారుడు మురళీకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

డీపీఆర్టీయూ సభ్యత్వాల నమోదు ప్రారంభం

తిరువూరు: మండలంలో డీపీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం ప్రారంభించినట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ.రావు, ఎస్.లక్ష్మణ్‌రాజు తెలిపారు. తొలిరోజు మండల పరిధిలోని 15 పాఠశాలలను సందర్శించి 46 మంది ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వాలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. నాయకులు బి.ప్రవీణ్, జి.శ్రీనివాసరావు, వీఎస్.చక్రవర్తి, సీహెచ్.రమేష్, కిషోర్, శ్రీకృష్ణ, ఎం.శ్రీను, కె.రాంబాబు, ఎన్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


చింతలపాడు బడిలో సభ్యత్వాలు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

అమ్మవారి ప్రసాదం పంపిణీ



కొండపల్లి మాంసం కొట్ల కూడలిలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ మండపంలో శుక్రవారం ప్రసాదం పంపిణీ చేశారు. 125 ఏళ్ల నుంచి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, కొండపల్లి

మునగాకుతో మేలైన పోషకాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని చినకొమిర అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మునగాకు ప్రయోజనాలపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు కార్యకర్త ఎ.ఉషారాణి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మునగాకు, పొడి ప్రతిరోజూ ఆహారంలో తీసుకుంటే శరీరానికి మంచి పోషకాలు అంది ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. లబ్ధిదారులతో కలిసి మునగ మొక్కలు నాటారు.

జూదరులపై కేసు

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెవుటూరు బైపాస్ సమీపంలోని ఓ చిల్లర దుకాణం కేంద్రంగా చేసుకుని జూదమాడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై కె.సతీష్‌కుమార్ సిబ్బందితో వారిపై శుక్రవారం దాడి చేశారు. ఇందులో అదే గ్రామానికి చెందిన 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,780 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక లారీ స్వాధీనం

జి.కొండూరు, న్యూస్‌టుడే: ఎటువంటి బిల్లులు లేకుండా మండలంలోని కుంటముక్కల వెల్లటూరు గ్రామాల మధ్య అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ శుక్రవారం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం మైనింగ్ అధికారులకు అప్పగించారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పశువుల సంత సమీపంలో శుక్రవారం పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు, తిరువూరు సీఐ కె.గిరిబాబు తెలిపిన వివరాల మేరకు... తిరువూరు ఎస్సై-1 సత్యనారాయణ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంత వద్ద ఉదయం రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మద్దిరాల లోకేశ్ (లోకి)తో పాటు ఇద్దరు మైనర్లు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో వారి వద్ద రూ.5వేలు విలువైన 900 గ్రాములు నిషేధిత గంజాయిని గుర్తించారు. తదుపరి ఠాణాకు తీసుకువచ్చి విచారించగా ఈ నెల 9, 10, 11 తేదీల్లో తిరువూరు పట్టణంలో జరిగిన 6 ద్విచక్ర వాహనాల చోరీ చేసింది వాళ్లేనని తేలింది. ఇద్దరు మైనర్ల సాయంతో లోకేశ్ నేరాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. అనంతరం వాహనాలను స్వాధీనం చేసుకుని ప్రధాన నిందితుడు లోకేశ్‌ను తిరువూరు న్యాయస్థానంలో హాజరుపరచగా మేజిస్ట్రేట్ అతనికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. మైనర్లను కూడా సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరుస్తామన్నారు.


స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్ర వాహనాలు ప్రదర్శిస్తున్న ఏసీపీ ప్రసాదరావు, సీఐ గిరిబాబు, ఎస్సైలు

దారుల్లేవ్.. దారుణాలే

మరమ్మతులకు నోచుకోని ఆర్‌అండ్‌బీ మార్గాలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే

భారీ వర్షాలకు ధ్వంసమైన ప్రధాన రహదారులు మరమ్మతులకు నోచుకోవడం లేదు. సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన అధిక వర్షాలకు వరదలు పోటెత్తడం ప్రవాహ ఉద్ధృతికి పంటలతో పాటు గ్రామాల్లోని మార్గాలూ పాడైపోయాయి. తారు లేచిపోయి, గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు.


అమ్మిరెడ్డిగూడెం వద్ద గుంతలు తేలి

తరచూ ప్రమాదాలు

ఈ ఏడాది వరద ఉద్ధృతికి తిరువూరు మండలం కోకిలంపాడు, గంపలగూడెం మండలంలో గాదెవారిగూడెం, అమ్మిరెడ్డిగూడెం, సొబ్బాల, చింతలనర్వ తదితర గ్రామాల పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారులు ధ్వంసమయ్యాయి. వరదలు తగ్గి 45 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు ఆయా మార్గాలకు అధికారులు మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా ప్రజలు అటుగా రాకపోకలు సాగించాలంటేనే అవస్థలు పడుతున్నారు. గుంతలో పడి తరచూ ప్రమాదాలకు గురువుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వరదలకు దెబ్బతిన్న రహదారులను బాగుచేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ ఒ.అచ్చారావును సంప్రదించగా మరమ్మతులకు అవసరమైన నిధులు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, మంజూరవగానే పనులు చేపడతామన్నారు.


ఆర్లపాడులో తారు లేచి ఇలా..


సొబ్బాల వెళ్లే మార్గంలో కోసుకుపోయి..

నందిగామ

●నందిగామ ●జగ్గయ్యపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

● బలుసుపాడు గ్రామంలో వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని గ్రామస్థులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా సచివాలయ కార్యదర్శి చంద్రశేఖర్‌కు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి వీధి దీపాలు మరమ్మతులు చేయించారు. వెంటనే స్పందించి వీధి దీపాలు వెలిగేలా చేసిన సచివాలయ కార్యదర్శికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. - జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే:

● జయంతి వాటర్ ట్యాంకు సమీపంలో వీధి దీపం వెలగడం లేదని గ్రామానికి చెందిన మాణిక్యాలరావు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా విద్యుత్ శాఖ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేయగా, స్పందించిన ఆయన సిబ్బందితో వీధి దీపాన్ని మార్పించారు.

● దొడ్డదేవరపాడు-వి.అన్నవరం రహదారి పక్కనే చెత్త పేరుకుపోతుండడంతో దుర్వాసన వస్తోందని గ్రామానికి చెందిన పరమేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సిబ్బందితో చెత్త తొలగింపజేశారు.

● వి.అన్నవరం బీసీ కాలనీలో రహదారిపై స్థానికులు కంకర కుప్పలు ఉంచడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని గ్రామానికి చెందిన రాజయ్య పంచాయతీ కార్యదర్శి నారాయణకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన కుప్పలు తీయించివేశారు.

● చెన్నారావుపాలెం ఎస్సీ కాలనీలో మురుగు కాలువలో చెత్త పేరుకుపోయి దుర్వాసనతో పాటు దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామానికి చెందిన రాంబాబు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా పంచాయతీ కార్యదర్శి ప్రియాంకకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆమె సిబ్బందితో కాలువలో చెత్త తీయించి మురుగు పారేలా చర్యలు చేపట్టారు. **- వీరులపాడు, న్యూస్‌టుడే**

అంతిమ యాత్రకు అష్టకష్టాలు

చౌటపల్లి(వీరులపాడు), న్యూస్‌టుడే : చౌటపల్లిలో ఎవరైనా మరణిస్తే వారి బంధువుల కష్టాలు వర్ణనాతీతం. అంత్యక్రియలు నిర్వహించడానికి స్థలం లేకపోవడంతో ఊరికి మూడు కిలో మీటర్ల దూరంలోని ప్రాంతానికి వెళ్లి కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తోంది. వర్షాకాలంలో అక్కడికి వెళ్లాలంటే ఇబ్బందే. దారి మొత్తం మోకాలి లోతు గుంతలతో అధ్వానంగా ఉంటుంది. మరణించిన వారి బంధువులకు అష్టకష్టాలు పడాల్సిందే. సొంత ట్రాక్టర్లు ఉన్న వారు ట్రాక్టరుపై మృతదేహాన్ని తీసుకెళ్లి కార్యక్రమం నిర్వహిస్తుంటారు. సొంత వాహనం లేని వారు భుజాలపై మోసుకెళ్లాల్సిందే. అంత దూరం వెళ్లలేక ఊరికి దగ్గరలోని మరో ఖాళీ స్థలంలో దశ దిన కర్మలు నిర్వహిస్తున్నారు. జోరున వర్షం కురిసిన సమయంలోనూ అక్కడ కార్యక్రమాలు చేయాల్సిందే. గత తెదేపా ప్రభుత్వ హయాంలో అంత్య క్రియలు నిర్వహించేందుకు ఊరికి దగ్గర్లో స్థలం కేటాయించి, కర్మలు నిర్వహించేందుకు భవన నిర్మాణం మొదలు పెట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో పనులు ప్రాథమిక స్థాయిలోనే నిలిచిపోయాయి. ఆ పనులు పూర్తి చేసి తమ కష్టాలు తీర్చాలని కూటమి ప్రభుత్వాన్ని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శిగా నజీమూన్

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఎన్టీఆర్ జిల్లా మహిళా సమాఖ్య ఎన్నికల్లో జగ్గయ్యపేట మహిళా సమాఖ్య అధ్యక్షురాలు షేక్ నజీమూన్‌ని కార్యదర్శిగా ఎన్నుకోవడంపై స్థానిక సమాఖ్య ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 14 సమాఖ్యల సమూహానికి జరిగిన ఈ ఎన్నికల్లో భాగంగా నజీమూన్‌కి కార్యదర్శిగా బాధ్యతలను అప్పగించడంపై వారంతా శుక్రవారం ఎమ్మెల్యే శ్రీరాంతాతయ్యను కలిసి ధన్యవాదాలు తెలిపారు.



ఎమ్మెల్యే తాతయ్యకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న షేక్‌నజీమూన్

మోటార్లు మునక.. ఎత్తిపోతల పడక

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

గత నెలలో మునేరుకు వచ్చిన వరద పెనుగంచిప్రోలు ఎత్తిపోతల పథకానికి భారీ నష్టాన్ని మిగిల్చింది. పథకం పూర్తిగా నీట మునగడంతో మోటార్లు, ప్యానల్ బోర్డులు, విద్యుత్తు నియంత్రికలు, లైన్, ఇతర పరికరాలు మరమ్మతులకు గురయ్యాయి. పథకాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు తయారు చేసి పంపాలని ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఇంకా పనులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పెనుగంచిప్రోలు ఎత్తిపోతల పథకం పంపుహౌస్

రూ.17 కోట్ల వ్యయంతో..

గత తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.17 కోట్ల వ్యయంతో పెనుగంచిప్రోలు వద్ద మునేరు పక్కనే ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. 2460 ఎకరాలకు సాగు నీరు అందించాలని నిర్ణయించారు. పథకం పరిధిలో వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తుంటారు. పెనుగంచిప్రోలు చెరువుకు పథకం నుంచి పైపులైన్ ద్వారా సాగునీరు అందుతుంది. చెరువు పరిధిలో పెనుగంచిప్రోలు, సుబ్బాయిగూడెం గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో వరి సాగు చేశారు. వెయ్యి ఎకరాల్లో పత్తి, సుమారు 400 ఎకరాల్లో మిర్చి వేశారు. రబీలో మొక్కజొన్న పండిస్తారు. ప్రస్తుతం ఎన్నెస్పీ కాలువ ద్వారా అరకొర నీరు అందుతోంది. వర్షాలు కురుస్తున్నాయి. రైతులకు పెద్దగా సాగునీటి అవసరం లేదు. రబీలో మొక్కజొన్న సాగు చేపట్టినపుడు మాత్రం నీటి అవసరం ఉంటుంది. ఆ సమయంలో ఎన్నెస్పీ కాలువ నుంచి కూడా సాగు నీరు రాదు. అందుకే ఎత్తిపోతలకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.లక్షల్లో నష్టం

మునేరులో గతంలో ఎన్నడూలేని విధంగా సుమారు 3 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. ఏటి ఒడ్డునున్న పంపుహౌస్ పూర్తిగా నీటమునిగింది. 4 మోటార్లు, ప్యానల్ బోర్డులు, విద్యుత్తు నియంత్రికలు మరమ్మతులకు గురయ్యాయి. విద్యుత్ లైన్ కొంతమేర కొట్టుకుపోయింది. ఇతర పరికరాలు కొన్ని పూర్తిగా దెబ్బతిన్నాయి. పరిశీలించిన ఐడీసీ అధికారులు తక్షణ మరమ్మతులకు రూ. 6 లక్షలు అవసరమని ప్రభుత్వానికి నివేదించారు.

త్వరలో మరమ్మతులు చేపడతాం

వరద వల్ల నియోజకవర్గంలో సుమారు 19 ఎత్తిపోతల పథకాలు దెబ్బతిన్నాయి. అందులో పెనుగంచిప్రోలు పథకానికి భారీ నష్టం వాటిల్లింది. అన్నింటికి మరమ్మతులు చేయడానికి ఐడీసీ అధికారులు అంచనాలు పంపారు. నిధుల కోసం ప్రయత్నిస్తున్నాం. త్వరలో మరమ్మతులు పూర్తి చేసి సాగునీటికి ఇబ్బంది రాకుండా చూస్తాం.

- శ్రీరాం తాతయ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే

తెదేపాలో చేరిక

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని తొర్రగుంటపాలెం గాయత్రినగర్‌కి చెందిన వీఎస్‌పీ ఉద్యోగ సంఘం నాయకుడు ఎల్ఎన్.సుబ్బారావు వైకాపాను వీడి తెదేపాలో చేరారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం చినబాబు ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

అన్నసమారాధన

జగ్గయ్యపేట: శరన్నవరాత్రి వేడుకలు ముగిసిన నేపథ్యంలో స్థానిక కాశీబజార్ లోని కనకదుర్గాలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఉదయభానుకు అభినందన

జగ్గయ్యపేట: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సామినేని ఉదయభానును శుక్రవారం కలిసిన కావలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఉదయభానును సత్కరించి అభినందనలు తెలిపారు.

వాహనాల తనిఖీ

జగ్గయ్యపేట: ఎన్టీఆర్ కూడలిలో జగ్గయ్యపేట ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో అనుమతుల్లేని ద్విచక్ర వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ మందు

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: పశుసంవర్ధక శాఖ ఈనెల 31 వరకూ నిర్వహిస్తున్న నట్టల నివారణ పక్షోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలని జగ్గయ్యపేట పశువైద్యశాల ఏడీ కె.భవానీప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన పలు ప్రాంతాల్లోని జీవాలకు నట్టల నివారణ మందు వేశారు.

బిక్కి నరసింహారావుకు నివాళి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: గుండెపోటుతో మృతి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బిక్కి నరసింహారావు మృతదేహానికి శుక్రవారం ఎన్నెస్పీ ఎడమ కాలువ మాజీ ఛైర్మన్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కాకాని శ్రీనివాసరావు, కాటేపల్లి రవికుమార్, తదితరులు నివాళులు అర్పించారు. నీటి సంఘం అధ్యక్షునిగా రైతులకు బిక్కి చేసిన సేవలను వారు కొనియాడారు.

కొంగరమల్లయ్య గట్టుపై మళ్లీ తవ్వకాలు

వత్సవాయి, న్యూస్‌టుడే



వత్సవాయి మండలం భీమవరం సమీపంలోని కొంగరమల్లయ్య గట్టుపై జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతుల పేరుతో ఏకంగా మల్లికార్జున స్వామి గట్టుకు పొక్లెయిన్‌లు పెట్టి గత రెండు రోజులుగా తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. గడిచిన కొన్నేళ్లుగా జరిగిన అక్రమ తవ్వకాలతో గట్టులోని ఒకవైపు పూర్తిగా గోతులమయంగా మారిందని, తాజాగా చేస్తున్న తవ్వకాలతో అవి మరింత పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం, రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడకపోవడంలో అంతర్యం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు నరసింహారావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సర్వే నంబరు 2771లో గ్రావెల్ తవ్వకాలకు మైనింగ్ అధికారులు అనుమతులు ఇచ్చారని తెలిపారు. అనుమతులు ఇచ్చిన సర్వే నంబర్లలో కాకుండా ఇతర ప్రాంతాల్లో తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తవ్వకాలను పరిశీలించాలని మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దాములూరు గ్రామంలో శుక్రవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సిమెంటు రహదారుల నిర్మాణ పనులకు సర్పంచి గాదెల వెంకటరామారావు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో సిమెంటు రహదారులు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు తులసీరావు, నేలవెల్లి సిద్ధార్థ, వెంకటయ్య, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న సర్పంచి వెంకటరామారావు

చందర్లపాడు, న్యూస్‌టుడే: పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా తుర్లపాడు, తోటరావులపాడు, చింతలపాడు, ఏటూరు గ్రామాల్లో సిమెంటు రోడ్ల ఏర్పాటుకు శుక్రవారం భూమిపూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ప్రజలపై భారం మోపితే సహించం'

జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీల విషయంలో ప్రజలపై భారం మోపితే సహించమని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఈ విషయమై ఆందోళన చేపట్టిన నాయకులు నినాదాలు చేస్తూ ట్రూ అప్ ఛార్జీల కింద రూ.8,114 కోట్లు ప్రజల నుంచి వసూలు చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. సీపీఎం నాయకులు సోమోజు నాగమణి, కోటాకృష్ణ, కాకనబోయిన లింగారావు, దంతాల వెంకటేశ్వర్లు, దంతాల నరేంద్ర, గౌస్ మియా, బూషమ్మ, దాసరి నాగేశ్వరరావు, కె.రవి కుమార్, స్.రామనాథం, రత్నబాబు తదితరులు పాల్గొన్నారు. సబ్‌స్టేషన్ వద్దకు వెళ్లి అధికారులకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.



నందిగామ: సీపీఎం నాయకులు, కార్యకర్తల ఆందోళన

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విద్యుత్తు ఛార్జీలు పెంచమనే హామీతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ట్రూఅప్ ఛార్జీల పేరుతో బిల్లులు పెంచేందుకు ప్రయత్నం చేయడం తగదని మండల సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం వత్సవాయి మండల శాఖ ఆధ్వర్యంలో విద్యుత్తు శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.రాము, కొండయ్య, గంగుల వెంకటేశ్వర్లు, కొరపాటి వెంకటేశ్వర్లు, భూతపల్లి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

నందిగామ, న్యూస్‌టుడే: ట్రూఅప్ ఛార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుందని, ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నందిగామలో సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. స్థానిక గాంధీ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కటారపు గోపాల్ మాట్లాడుతూ.. సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ. 8114 కోట్లు విద్యుత్తు వినియోగదారులపై మోపనున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతుండటం వల్ల పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సయ్యద్ ఖాసీం, కర్రి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, లాజరు తదితరులు పాల్గొన్నారు.




జగ్గయ్యపేట: అధికారికి ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

పల్లెల్లో మౌలిక వసతులు

అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం

చందర్లపాడు, న్యూస్‌టుడే

వైకాపా ప్రభుత్వ హయాంలో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడింది. కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు వచ్చిన ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించడంతో గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరలేదు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లే పరిస్థితి లేకుండా పోయింది. నిర్లక్ష్యానికి గురైన పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామస్థులే అభివృద్ధిలో భాగస్వాములు కావాలనే లక్ష్యంతో గ్రామ సభలు నిర్వహించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న పనులపై గ్రామస్థులు చర్చించారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించారు. ప్రాధాన్య క్రమంలో వాటిని పరిష్కరించాలని నిర్ణయించారు. అందులో కొన్ని పనులు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. అంతర్గత రహదారులు, కాలువలు, ప్రహరీలు తదితరాలపై దృష్టి కేంద్రీకరించి పల్లె పండగ పేరుతో వారం రోజుల పాటు వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహిస్తున్నారు. ఆయా పనులన్నీ సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి పల్లెల రూపురేఖలు మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రస్తుతం రూ. 4.55 కోట్లతో 27 పనులు చేపట్టనున్నారు. బొబ్బెళ్లపాడు, గుత్తావారిపాలెం తదితర గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఇటీవల భూమి పూజ కూడా చేశారు.



గుత్తవారిపాలెంలో సిమెంటు రోడ్డుగా రూపుమారనున్న మట్టి రహదారి

పంచాయతీ	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
చందర్లపాడు	04	99
ముప్పాళ్ల	02	43
చింతలపాడు	02	36
పొక్కునూరు	01	15
కొడవటికల్లు	01	33
పున్నవల్లి	01	07
వెలదికొత్తపాలెం	01	23
పోపూరు	01	05
విభరింతలపాడు	01	10
ఏటూరు	02	30
తోటరావులపాడు	01	28
తుర్లపాడు	03	44
మునగాలపల్లి	01	11
బొబ్బెళ్లపాడు	01	10
కోనాయపాలెం	01	15
ఉస్తేపల్లి	01	05
గుడిమెట్ల	01	21
గుత్తావారిపాలెం	01	05
లక్ష్మీపురం	01	15

నలువైపులా.. నిఘా నేత్రాలు!

2800 సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

న్యూస్‌టుడే, జగ్గయ్యపేట

నేర నిర్ధారణ, నేర నియంత్రణల్లో కీలకపాత్ర పోషించే నిఘా నేత్రాలు నీరసించడంతో పోలీసు వ్యవస్థకు అవసరమైన వెన్నుదన్ను లేకుండా పోయింది. నియోజకవర్గ కేంద్రమైన జగ్గయ్యపేట పట్టణం సహా సర్కిల్ పరిధిలోని మూడు మండల కేంద్రాలు, 72 గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొనడంతో పోలీసులకు నేర నియంత్రణ కత్తి మీద సాములా మారింది. రెండు దశాబ్దాల కిందటే అప్పటి మైత్రి సంఘాలు, ఇతర పోలీసు అనుబంధ పౌరసంఘాల కృషితో జగ్గయ్యపేట పట్టణం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచింది.

పాత మున్సిపల్ కార్యాలయంపై ఒక కంట్రోల్‌రూం ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా పట్టణం మొత్తాన్ని వీక్షించే వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు, అధికారుల్లో దానిపై దృష్టి లేని కారణంగా ప్రాధాన్యత తగ్గింది. కేవలం ఎన్నికల సమయంలో ఈసీ ఆదేశాలతో ఏర్పాటు చేసే ప్రత్యేక నిఘా తప్ప సాధారణ సమయాల్లో వీటి ప్రాముఖ్యత పూర్తిగా తగ్గించారు.

శాంతి భద్రతలకు ప్రాధాన్యం..

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలకు, మాదక ద్రవ్యాల నివారణకు, మహిళా రక్షణకు పెద్దపీట వేస్తోంది. ఈ నేపథ్యంలో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు నిఘా నేత్రాల ఏర్పాటు ప్రధానమని నిర్ణయించారు. ఈ క్రమంలోనే పట్టణం సహా సర్కిల్ పరిధిలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించడంతో పాటు వాటిని జియో ట్యాగింగ్ ద్వారా జిల్లా అధికారులకు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ క్రమంలోనే పట్టణంలో సుమారు 700, సర్కిల్ పరిధిలో మొత్తం 2800 సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన సమాచారాన్ని పంపారు. త్వరలోనే ఇవి కార్యరూపం దాల్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నేరాలను నియంత్రించడానికి, జరిగిన నేరాలను నిర్ధారించడానికి అనుకూలమైన వ్యవస్థ ఏర్పడనుంది. ప్రస్తుతం పట్టణ వ్యాప్తంగా ఉన్న సుమారు 100కి పైగా సీసీ కెమెరాల్లో చాలావరకూ పనిచేయకపోవడంతో ఎక్కడైనా నేరం లేదా ప్రమాదం జరిగితే అందులో నిందితులెవరన్నది నిర్ధారించలేక సతమతమవ్వాల్సి వస్తోంది. నూతన ప్రతిపాదనలు త్వరితగతిన కార్యరూపంలోకి వస్తే సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో పోలీసులు ముందడుగు వేసే అవకాశాలు అధికంగా ఉన్నాయి.



జగ్గయ్యపేటలో అరకొరగా పనిచేస్తున్న సీసీ కెమెరాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలం గరికపాడు వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. చిల్లకల్లు ఎస్సై సూర్య శ్రీనివాస్ కథనం ప్రకారం.. తొగర్రాయి గ్రామానికి చెందిన యలమర్తి అశోక్ (30) చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామానికి వెళ్తుండగా గరికపాడు వద్ద ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అశోక్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణ మద్యం పట్టివేత

కీసర(కంచికచర్ల), న్యూస్‌టుడే : మండల పరిధిలోని కీసరలో తెలంగాణ మద్యం అక్రమంగా అమ్ముతున్న కలతోటి లిల్లీ బాబుని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 45 తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బోనగిరి రాజు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెంగనాయకునిపాలెంలో విషాదం

పాముకాటుతో అన్నదాత, విద్యుదాఘాతంతో మహిళ దుర్మరణం

పెనుగంచిప్రోలు: ఒకే రోజు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందటంతో మండలంలోని వెంగనాయకునిపాలెం గ్రామంలో శుక్రవారం విషాదం నెలకొంది. ఎస్సై అర్జున్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్ల వెంకటేశ్వరరావు (38) అనే రైతు మునేరు అవతల ఉన్న తన వరి పొలానికి వెళ్లాడు. పొలంలో తిరుగుతుండగా కుడికాలిపై పాము కాటు వేసింది. స్థానిక రైతుల సాయంతో 108 వాహనంలో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతుడికి భార్య వెంకటకృష్ణ, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

తడిసిన దుస్తులు ఆరేస్తుండగా..

గ్రామానికి చెందిన దొత్తుల గౌతమి (36) శుక్రవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. వర్షానికి తడిసిన దుస్తులను దండెంపై ఆరవేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యారు. కుటుంబ సభ్యులు గమనించి కర్రల సాయంతో పక్కకు లాగి నందిగామ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. దుస్తులు ఆరేసుకునేందుకు ఇనుప తీగను దండెంగా కట్టారు. దండెం తీగకు ఇంట్లో ఉన్న విద్యుత్తు మీటరు నుంచి వచ్చే సర్వీస్ తీగ కలవడం వల్ల దండెం తీగకు విద్యుత్తు ప్రవహించినట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలికి భర్త రాజానారాయణ, పదేళ్లలోపు కుమార్తె, కుమారుడు ఉన్నారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అర్జున్ తెలిపారు. ఇద్దరి మృతదేహాలకు నందిగామ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు.

మద్యం దుకాణం ఏర్పాటు అడ్డగింత



రికార్డులు చూపిస్తున్న ఆలయ ఈవో గంగాధర్

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి చెందిన స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయబోతుండగా అధికారులు అడ్డుకున్నారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో విజయవాడ రోడ్డు పక్కన ఆలయ భూమి ఉంది. అక్కడ దుకాణాల్లో పలువురు వ్యాపారాలు చేసుకుంటున్నారు. దేవాదాయ శాఖ నిబంధనలకు విరుద్ధంగా ఆ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయబోతుండగా.. ఆలయ ఈవో గంగాధర్‌కు సమాచారం వెళ్లింది. వెంటనే ఆయన అక్కడికి వచ్చి అభ్యంతరం వ్యక్తం చేశారు. దేవాలయ స్థలంలో మద్యం వ్యాపారం ఎలా చేస్తారని ప్రశ్నించారు. సంబంధిత రికార్డులు చూపించారు. ప్రస్తుతం దుకాణం ఏర్పాటు ఆగింది.

వైద్యశాల దారి అధ్వానం



కంచికచర్ల: కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగుల పాలిట నరకంలా మారింది. ప్రధాన రహదారి నుంచి ఆసుపత్రి వరకు సుమారు 1 కి.మీ. దూరం ఉన్న ఈ రహదారిని గత ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా అడుగుకొక గుంతతో రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రహదారి మొత్తం బురదకయ్యలా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా తయారైందని రోగులు వాపోతున్నారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వమైనా రహదారిని శాశ్వత ప్రాతిపదికన నిర్మించి రోగుల ఇక్కట్లు తీర్చాలని కోరుతున్నారు.

మునగాకుతో రక్తహీనత దూరం

నందిగామ గ్రామీణం, కంచికచర్ల, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు తమ ఆహారంలో మునగాకు పొడి కలిపి తీసుకోవాలని ఐసీడీఎస్ లింగాలపాడు సెక్టార్ సూపర్‌వైజరు జి.వెంకట్రావమ్మ సూచించారు. శుక్రవారం ఐసీడీఎస్ జిల్లా పీడీ ఉమాదేవి ఆదేశాలతో మండలంలోని చందాపురం, లింగాలపాడు, చెర్వుకొమ్ముపాలెం, అంబారుపేట, పాతకంచల అంగన్‌వాడీ కేంద్రాల్లో కమ్యూనిటీ ఆధారిత కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో మునగ, కరివేపాకు తదితర మొక్కలు నాటారు. మహిళల్లో రక్తహీనత నివారణకు మునగాకు దోహదపడుతుందని చెప్పారు.

● గర్భిణులు, బాలింతలు పోషకాహారం తప్పకుండా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తారాబీ అన్నారు. కంచికచర్ల సెక్టార్ పరిధిలోని 12వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ఆవశ్యకతపై శుక్రవారం అవగాహన కల్పించారు. టి.వాణి, బి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● మునగాకును ప్రతి రోజూ ఆహారంలో తీసుకోవడం ద్వారా విలువైన పోషకాలు అందుతాయని అంగన్‌వాడీ కార్యకర్తలు వివరించారు. ముండ్లపాడులోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మునగాకుపై తల్లులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తల ధనలక్ష్మీ, సుగుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

● రక్తహీనతకు పరిష్కారంగా మునగాకు వినియోగాన్ని పెంచాలని ఐసీడీఎస్ అధికారిణి భార్గవి సూచించారు. శుక్రవారం పట్టణంలోని 12వ వార్డులో రక్తహీనత నివారణకు మునగాకు వినియోగంపై అవగాహన కల్పించారు. మునగ మొక్కలను పంపిణీ చేశారు.

వెల్లంకి(వీరులపాడు), న్యూస్‌టుడే : గర్భిణులు, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతపై వెల్లంకి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ పెరట్లో మునగ, కరివేపాకు మొక్కలు పెంచుకోవాలని అన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.ప్రభావతి, పుల్లమ్మ, మేరమ్మ, శాంతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ తూర్పు

స్పందనకు వందనం

❖ పటమట సెంటర్ సరోజని ఆస్పత్రి రోడ్డులో చెత్త తొలగించడం లేదని స్థానిక నివాసి శామ్యూల్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా శానిటరీ అధికారి ఆంజనేయులు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చెత్త కుప్పలను తీయించివేశారు.

❖ 14వ డివిజన్ పటమట లంక ప్రాంతంలో 14-60/68 విద్యుత్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి రాము మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

? మాచవరం ఆంజనేయ స్వామి గుడి ఎదురుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి మురుగు నీరంతా ఏలూరు రోడ్డుపైకి వస్తోంది.– రవి

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం –నాగేశ్వరరావు, ఏఈ

? గుణదల కుమ్మరి బజార్ ప్రాంతంలో 2-27/96 విద్యుత్ స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు.– బ్రహ్మం

✔ కొత్త దీపాన్ని ఏర్పాటు చేస్తాం –నారాయణ, ఏఈ

– న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ఉచిత వైద్య శిబిరం నేడు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదకు కొందరు అనారోగ్యం బారిన పడిన నేపథ్యంలో వాంబే కాలనీలో ఈనెల 19వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకూ స్పెషలిస్ట్ వైద్యులతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి సుహాసిని శుక్రవారం తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వాంబే కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం జీఎక్స్‌ఎల్-జి బ్లాక్‌లో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గుండె, ప్రసూతి, పిల్లలు, సాధారణ వ్యాధులకు వైద్య సేవలు అందిస్తారని, ఉచితంగా రక్త పరీక్షలు చేసి, మందులు అందిస్తారని పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికులకు అదనపు జీతం ఇవ్వాలి

చిట్టినగర్, న్యూస్‌టుడే: బుడమేరు వరదలో అహర్నిశలు శ్రమించిన మున్సిపల్ కార్మికులకు అదనంగా ఒక నెల జీతం ఇవ్వాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 24న నిర్వహిస్తున్న నగర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ 49వ డివిజన్ ప్రైజర్‌పేట శానిటరీ కార్యాలయంలో కార్మికులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

అడ్డదిడ్డంగా ఆటోలు.. ప్రజలకు అవస్థలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ప్రయాణికులను ఎక్కించుకోవాలనే తొందరలో ఆటోలు ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారు. వెనుక వైపు వాహనాలు వస్తున్నాయని కనీసం గమనించకపోవడం వల్ల ద్విచక్రవాహన చోదకులు, ఇతర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. వర్తక, వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు, ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రులు ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో విజయవాడకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు, చిరుద్యోగులు నగరానికి వస్తుంటారు. లబ్బీపేట, మొగల్రాజపురం, పటమట, కరెన్సీనగర్, భారతినగర్, ఆటోనగర్, ఎంజీ రోడ్డు, ఏలూరు రోడ్డు, గుణదల తదితర ప్రాంతాల్లోని రాష్ట్ర, జిల్లా కార్యాలయాలకు ప్రజలు, కనకదుర్గమ్మ దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. ఆయా స్టాపుల వద్ద బస్సులు ఎక్కడం, దిగడం చేస్తుంటారు. అక్కడ అడ్డంగా ఆటోలు ఆపడం వల్ల ఆర్టీసీ బస్సులను దూరంగా నిలుపుతున్నారు. వాటిని ఎక్కడానికి ప్రయాణికులు పరుగులు తీస్తున్నారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఎంజీ రోడ్డులో వైవీరావు హాస్పటల్, డీవీ మానర్, పీవీపీ మాల్ తదితర ప్రధాన కూడళ్లలో అడ్డంగా నిలుపుతున్నారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు చెబుతున్నారు. బెంజిసర్కిల్ వద్ద కూడా ఆటోలు నిలపడం వల్ల వాహనదారులకు అసౌకర్యంగా ఉంటోంది. డ్రైవర్లకు అవగాహన కల్పించి ఆటోలను సక్రమంగా ఆపేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


బెంజిసర్కిల్ వద్ద ఇలా..


డి అడ్రస్‌మాల్ బస్టాప్ వద్ద..

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత సాధ్యం అని దుర్గ గుడి ఈవో రామారావు అన్నారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో శుక్రవారం నిర్వహించిన ధ్యాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఈవో మాట్లాడారు. దుర్గమ్మ సన్నిధిలో చేసే ధ్యానం ద్వారా మనసులో అనుకూల ప్రభావం వృద్ధి చెందుతుందన్నారు. యోగా, ధ్యానం వంటివి భారతీయ సంస్కృతిలో భాగమన్నారు.

దుర్గమ్మ చిత్రపటం బహూకరణ.. : దసరా శరన్నవ వేడుకలను పురస్కరించుకొని శ్రీకాకుళానికి చెందిన యువ కళాకారుడు దాకోజు లాల్ ప్రసాద్ స్వయంగా చిత్రించిన చిత్రపటాన్ని శుక్రవారం అందజేశారు. పదకొండు రోజులు అమ్మవారి దీక్షలో దీన్ని రూపొందించినట్లు లాల్ ప్రసాద్ తెలిపారు. దేవస్థానం అధికారులు చిత్ర కళాకారుడికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

దుర్గ గుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గుంటూరు మల్లికార్జునపురం కాలనీకి చెందిన ఇ. సునీల్ కుమార్ రూ.1,11,111 విరాళాన్ని శుక్రవారం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి: గద్దె

కృష్ణలంక, న్యూస్‌టుడే: విదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి వచ్చి పరిశ్రమలు స్థాపించేందుకు సిద్ధంగా ఉన్నందున, రానున్న రోజులన్నీ రాష్ట్ర ప్రజలకు మంచి రోజులేనని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 21వ డివిజన్ తెదేపా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... వారంలో ఒక రోజు ఒక డివిజన్‌లో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి వారంలోనే పరిష్కారమయ్యేలా కొత్త విధానాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. సమస్య స్థాయిని బట్టి కమిషనర్‌కు, మంత్రి, అవసరమైతే ముఖ్యమంత్రి స్థాయికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వెల్లడించారు. ముందుగా కృష్ణలంక 21వ డివిజన్‌లో సమావేశం నిర్వహించామని, ఇక్కడ యూజీడీ సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను మున్సిపల్ కమిషనర్, మంత్రి పి.నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆరు నెలల వ్యవధిలో రాష్ట్రంలో సమస్యల పరిష్కారంతో పాటు ప్రజా సంక్షేమ పథకాలు కూడా అమలవుతాయని వెల్లడించారు. వేములపల్లి రంగారావు, గొరిపర్తి నామేశ్వరరావు, గుండు శ్రీను, భావన్నారాయణ, రంగారావు, సుబ్బారావు, ఈశ్వరరావు, పవన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కృష్ణలంకకు చెందిన గజ్జవరపు ఏసుకు తన సొంత నిధులు రూ.25 వేలు వెచ్చించి కొనుగోలు చేసిన వినికిడి యంత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు.


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్

ఓల్గా ఆర్చరీ అకాడమీ సందర్శన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు శుక్రవారం సందర్శించారు. అకాడమీ అధ్యక్షుడు చెరుకూరి సత్యనారాయణ సాదరంగా అతనికి స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం రవినాయుడు ఆర్చర్లతో మమేకమయ్యారు. ఆర్చరీలో సాధించిన పతకాల గురించి వారు ఛైర్మన్‌కు వివరించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. అకాడమీలోని ఆర్చర్లందరూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై సాధన చేస్తున్నారన్నారు. అకాడమీకి కావలసిన మౌలిక వసతుల గురించి రవినాయుడు దృష్టికి తీసుకెళ్లారు. రవినాయుడు సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


విల్లు ఎక్కుపెట్టిన రవినాయుడు, పక్కన డాలీ శివానీ, వెంకట రమణ, సత్యనారాయణ

అమరవీరుల సంస్మరణ సభకు ఏర్పాట్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. క్రీడా ప్రాంగణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. ప్రాంగణంలో తాగు నీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని పేర్కొన్నారు. అధికారులు డి.చంద్రశేఖర్, టి.శ్రీనివాస్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు: కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణాలు, మరమ్మతులు చేపడుతున్నందున ప్రజలు నడిచేందుకు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కరెన్సీనగర్, మొగల్రాజపురం, గుణదల, ఈఎస్ఐ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అధికారులకు సూచనలు చేశారు. నగరంలోని పలు చోట్ల నూతన డ్రెయిన్ల నిర్మాణాల కోసం చేసిన తవ్వకాల వల్ల ప్రజలు నడిచేందుకు వీలులేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తవ్విన డ్రెయిన్లపైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే స్థానిక ప్రజలు సులువుగా రాకపోకలు సాగిస్తారని అన్నారు. పనులు సైతం త్వరగా పూర్తిచేసి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని అన్నారు. ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద చేపట్టిన తవ్వకాలతో వైద్యశాలకు వెళ్లే రోగులు ఇబ్బంది పడుతున్నందున తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదే సమయంలో పనుల వల్ల వాహన చోదకులు సైతం ఇబ్బంది పడకుండా చూడాలని అన్నారు. ప్రధాన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు.


అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర



మేఘాలయ, ఏసీఏ క్రికెట్ జట్ల సాధన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మూలపాడులోని డాక్టర్ గోకరాజు లైలాగంగరాజు ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో ఈ నెల 20 నుంచి బీసీసీఐ కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా జరిగే అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లో శుక్రవారం మేఘాలయ, ఆంధ్రా క్రికెట్ సంఘం (ఏసీఏ)జట్లు మైదానంలో ప్రాక్టీసు చేశాయి. ఏసీఏ జట్టు మైదానంలో వార్మప్, ఫిట్‌నెస్ చేయగా.. మేఘాలయ జట్టు నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ సాధన చేసింది. ఈ నెల 20 నుంచి ఇరు జట్ల మధ్య మల్టీ డే (నాలుగు రోజుల)మ్యాచ్‌లు జరుగుతాయి. శనివారం కూడా ఇరు జట్లు సాధన చేయనున్నాయి.

కమ్యూనికేషన్ రంగం కీలకం

చిట్టినగర్, న్యూస్‌టుడే: భారతదేశం అద్భుతమైన ప్రగతిని సాధించేందుకు కమ్యూనికేషన్ రంగం కీలకంగా నిలిచిందని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ప్రొఫెసర్ నాగిని అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 'యాంటీనా టెక్నాలజీస్'పై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. కళాశాల కార్యదర్శి అమరసుధీర్, కోశాధికారి రాఘవయ్య, ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి రంగారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా

రామవరప్పాడు, న్యూస్‌టుడే: ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ నిర్వహించిన సర్వేలో దేశంలోని కోఎడ్యుకేషన్ 'డే కమ్ బోర్డింగ్' పాఠశాలల విభాగంలో 1500 పాయింట్లకు 1183 పాయింట్లు సాధించి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆంధ్రప్రదేశ్‌లో మొదటి స్థానం, జాతీయ స్థాయిలో 17వ స్థానం సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ తెలిపారు. అత్యుత్తమ విద్యా బోధనలు, విద్యార్థుల్లో నైపుణ్యాలు ఆధారంగా ఈ సర్వే నిర్వహించారు. గురువారం దిల్లీలో ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ప్రతినిధుల నుంచి పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.


దిల్లీలో అవార్డు అందుకుంటున్న పాఠశాల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ పరిమి పవన్ చంద్

సత్వరమే వైద్య సేవలందించాలి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : అయోధ్యనగర్, దుర్గాపురం పట్టణ ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం అక్కడ అందుతున్న సేవల గురించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వచ్చిన రోగులకు వెంటనే వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దుర్గాపురంలో ఫ్రైడే డ్రైడేని పరిశీలించారు.


సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

ఆటోలపై కేసులు రాయొద్దు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: గూడ్స్ ఆటోలపై కేసులు రాయడం ఆపాలని ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావుకు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఎగుమతి, దిగుమతుల కోసం గూడ్స్ ఆటోల వినియోగం తప్పని సరి అయినందున ముఠా కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్రావు, ఏడుకొండలు, కాశయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తవ్వారు... వదిలేశారు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : అభివృద్ధి పనులు చేస్తామని ఫుట్‌పాత్ తవ్వారు.. నెలలు అవుతున్నా పనులు ప్రారంభించలేదు. దీంతో దుకాణదారులు, వినియోగదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పాదచారుల సౌకర్యార్థం గ్రానైట్ వేస్తామని ఎంజీ రోడ్డులో ఫుట్‌పాత్ తవ్వారు. కొంత మేర పనులు నిర్వహించి వదిలేశారు. రాకపోకలకు అసౌకర్యంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని, దుకాణాలకు రావాలంటే వెనుకంజ వేస్తున్నారని దుకాణదారులు చెబుతున్నారు. వెంటనే పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విజయవాడ పశ్చిమ

ధ్యానంతో మానసిక ప్రశాంతత


ధ్యాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఈవో రామారావు


అమ్మవారి చిత్రపటాన్ని దేవస్థానం అధికారులకు అందజేస్తున్న కళాకారుడు లాల్ ప్రసాద్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత సాధ్యం అని దుర్గ గుడి ఈవో రామారావు అన్నారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో శుక్రవారం నిర్వహించిన ధ్యాన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఈవో మాట్లాడారు. దుర్గమ్మ సన్నిధిలో చేసే ధ్యానం ద్వారా మనసులో అనుకూల ప్రభావం వృద్ధి చెందుతుందన్నారు. యోగా, ధ్యానం వంటివి భారతీయ సంస్కృతిలో భాగమన్నారు.

దుర్గమ్మ చిత్రపటం బహూకరణ..

దసరా శరన్నవ వేడుకలను పురస్కరించుకొని శ్రీకాకుళానికి చెందిన యువ కళాకారుడు దాకోజు లాల్ ప్రసాద్ స్వయంగా చిత్రించిన చిత్రపటాన్ని శుక్రవారం అందజేశారు. పదకొండు రోజులు అమ్మవారి దీక్షలో దీన్ని రూపొందించినట్లు లాల్ ప్రసాద్ తెలిపారు. దేవస్థానం అధికారులు చిత్ర కళాకారుడికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు.

దుర్గ గుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి: శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గుంటూరు మల్లికార్జునపురం కాలనీకి చెందిన ఇ. సునీల్ కుమార్ రూ. 1,11,111 విరాళాన్ని శుక్రవారం అందజేశారు. దాత కుటుంబానికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. దేవస్థానం సూపరింటెండెంట్ సత్యనారాయణ వారికి విరాళం రసీదుతోపాటు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

వైద్య శిబిరం నేడు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదకు కొందరు అనారోగ్యం బారిన పడిన నేపథ్యంలో వాంబే కాలనీలో ఈనెల 19వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకూ స్పెషలిస్ట్ వైద్యులతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి సుహాసిని శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వాంబే కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రం జీఎక్స్ ఎల్-జి బ్లాక్‌లో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గుండె, ప్రసూతి, వైద్య సేవలతోపాటు మందులు అందిస్తారని పేర్కొన్నారు.

ఆదాయం వస్తున్నా.. అలుసెందుకో..!

‘వస్త్రలత’ సముదాయంలో వసతుల కరవు

ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం

విద్యాధరపురం, న్యూస్‌టుడే

పాత బస్తీలోని వస్త్రలత దుకాణ సముదాయంలో మౌలిక వసతులు కరవయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. అసోసియేషన్ నాయకులు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. కార్పొరేషన్ అధికారులు మూడేళ్లకోసారి అద్దె పెంచడంపైన చూపిన శ్రద్ధ సమస్యల పరిష్కారానికి చూపడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంప్లెక్సులో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లకు కూడా మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు.


మూతపడిన క్యాంటీన్


వస్త్రలత దుకాణ సముదాయం

దుకాణాలు సుమారు 450

ఏటా అద్దెల రూపంలో కార్పొరేషన్‌కు వచ్చే ఆదాయం రూ.12 కోట్లు

ఆధారపడిన వారు గుమస్తాలు: సుమారు 2 వేలు

ముఠాకూలీలు సుమారు 3 వేలు

పెచ్చులూడుతున్న స్లాబ్..

వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. సముదాయ స్లాబు పెచ్చులు ఎప్పుడు ఊడి నెత్తిన పడతాయోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నెలకు రూ.కోట్లు వ్యాపారం జరిగే ఈ ప్రాంతం నిత్యం కొనుగోలుదారులు, దుకాణదారులతో కిటకిటలాడుతుంటుంది. అద్దెల రూపంలో ఏడాదికి రూ. 12 కోట్లు ఆదాయం కార్పొరేషన్‌కు వస్తున్నా.. దుకాణాలకు తమ సొంత డబ్బుతో మరమ్మతులు చేసుకోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

భోజనాలకూ ఇబ్బందే..

కాంప్లెక్స్‌లోని క్యాంటీన్ మూతపడి మూడేళ్లు గడుస్తోంది. ఇక్కడ పనిచేసే కార్మికులతో పాటు వ్యాపార అవసరాల నిమిత్తం వచ్చే వ్యాపార వర్గాలు, ముఠా కూలీలు అల్పాహారం, భోజనం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొవిడ్ సమయంలో మూతపడిన క్యాంటీన్ తర్వాత తిరిగి తెరవలేదు. వస్త్రలత అసోసియేషన్ నాయకులు కూడా క్యాంటీన్ తెరిపిస్తామని చెబుతున్నా కార్యరూపం దాల్చలేదు.

సమస్యలు పరిష్కరిస్తాం...

సముదాయం నిర్మించి దశాబ్దాలు అవుతోంది. మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. కొన్ని చోట్ల వ్యాపారులే సొంత ఖర్చులతో బాగు చేయించుకుంటున్నారు. మూతపడిన క్యాంటీన్ తెరిపించేందుకు ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తాం.

- జగన్‌మోహన్‌రావు, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

పనుల్లేక నిర్మాణ రంగ కార్మికుల అవస్థలు

భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని వెంటనే అమలు చేసేలా చర్యలు చేపట్టాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు పశ్చిమ శాసనసభ్యుడు సుజనాచౌదరి కార్యాలయంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉచిత ఇసుక హామీ అమల్లోకి రాకపోవటంతో నిర్మాణ రంగ కార్మికులు పనులు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఇసుక విధానం అస్పష్టంగా ఉందని, దీంతో ధర అమాంతంగా పెరిగి ప్రజలు కొనలేని పరిస్థితులు నెలకొన్నాయని వెల్లడించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, అమ్మకాలు జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదన్నారు. ఫలితంగా నిర్మాణ రంగ కార్మికుల ఉపాధి, ఆర్థిక పరిస్థితిపై తీవ్రమైన ప్రభావం పడిందని వినతిలో పేర్కొన్నారు. నాయకులు నరసింహారావు, అప్పారావు, ఎస్.సుబ్బారెడ్డి, శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యపరీక్షలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఉచిత వైద్యశిబిరాలను పేద వర్గాలు వినియోగించుకోవాలని కూరపాటి చంద్రశేఖరరావు హైస్కూల్ ప్రిన్సిపల్ యుగంధరాచార్య అన్నారు. పాతబస్తీలోని కూరపాటి చంద్రశేఖరరావు హైస్కూల్లో వ్యవస్థాపకుడు చంద్రశేఖరరావు జయంతిని పురస్కరించుకొని అయాన్ నేత్రవైద్యశాల వైద్యులు ఉచిత నేత్ర పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమకూర్చిన రూ.1.50 లక్షలు ఉపకార వేతనాలను విద్యార్థులకు అందజేశారు. పాఠశాల కార్యదర్శి నారాయణరావు, వైద్యులు బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణాలు, మరమ్మతులు చేపడుతున్నందున ప్రజలు నడిచేందుకు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కరెన్సీనగర్, మొగల్రాజపురం, గుణదల, ఈఎస్ఐ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అధికారులకు సూచనలు చేశారు.

అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి ఏర్పాట్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. క్రీడా ప్రాంగణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు.

ఉచిత ఇసుక విధానం పూర్తి స్థాయిలో అమలు చేయండి

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉచితంగా ఇసుక విధానాన్ని అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పశ్చిమ నగర కార్యదర్శి కె.శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇసుక విషయమై కార్మికులు ఆంజనేయవాగు సెంటర్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచినా ఇప్పటికీ ప్రజలకు ఇసుక ఉచితంగా అందుబాటులోకి తీసుకురాలేకపోవటం బాధాకరమని అన్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలు వెచ్చించి కొనాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇసుక పాలసీ విధానంలో గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఏమాత్రం తేడా లేదన్నారు. ఇసుక మాఫియా రాజ్యమేలుతుందని, అక్రమంగా ఇసుకను లాభాపేక్షతో అమ్ముకుంటున్నా ప్రభుత్వం కట్టడి చేయలేకపోతుందన్నారు. ఇసుక ఉచితంగా అందుబాటులోకి వస్తే భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరుకుతాయని, వారి జీవన విధానం మెరుగుపడుతుందన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు కె.సూరిబాబు, సీఐటీయూ నాయకులు నారాయణ, శ్రీను, కనకారావు, తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయవాగు సెంటర్‌లో సీఐటీయూ నాయకుల ధర్నా

వరద బాధితులకు చేయూత

చిట్టినగర్, న్యూస్‌టుడే: బుడమేరు వరద బాధితులకు సాయం అందించాలనే సంకల్పంతో దుస్తులు అందజేయడం స్ఫూర్తిదాయకమని భాజపా ఓబీసీ రాష్ట్ర కోశాధికారి బలివాడ శివకుమార్ పట్నాయక్ అన్నారు. నంద్యాల జిల్లా కోయిలకుంట్ల మండలానికి చెందిన విక్కీ ఫౌండేషన్ నిర్వాహకులు గోపిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తులు అందజేశారు.

భవానీ భక్తులకు ప్రసాదాల అందజేత.. **విద్యాధరపురం:** దుర్గమ్మ ఆశీస్సులతో బుడమేరు వరద బాధితుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని శ్రీదేవి విజ్ఞాన్ జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు (విశాఖపట్నం) అధ్యక్షురాలు కీర్తి పట్నాయక్ అన్నారు. భవానీ దీక్షల విరమణ సందర్భంగా వచ్చిన దీక్షాధారులకు ట్రస్టు తరపున శుక్రవారం ఆమె ప్రసాదాలను పంపిణీ చేశారు.

మున్సిపల్ కార్మికులకు అదనపు జీతం ఇవ్వాలి

చిట్టినగర్, న్యూస్‌టుడే: బుడమేరు వరదలో అహర్నిశలు శ్రమించిన మున్సిపల్ కార్మికులకు అదనంగా ఒక నెల జీతం ఇవ్వాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 24న నిర్వహిస్తున్న నగర మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ 49వ డివిజన్ ప్రైజర్‌పేట శానిటరీ కార్యాలయంలో కార్మికులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. నాయకులు తెడ్డు వెంకటేశ్వరరావు, రాజా, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

చిట్టినగర్, న్యూస్‌టుడే: 50వ డివిజన్ పరిధిలోని టెట్రాపిళ్లై వీధిలో ర్యాంపు నిర్మాణం, గొల్లపాలెంగట్టు, మహంతిపురం రోడ్లు తదితర ప్రాంతాల్లో నిలిచిన అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ ఎస్ఈ హనుమంతరావు శుక్రవారం పరిశీలించారు. ఆయనతోపాటు సర్కిల్-1 ఈఈ ప్రసాద్, ఏఈలు రాజేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. తమ పార్టీ తరపున ఇచ్చిన వినతిపై స్పందించి కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు పర్యటించినట్లు సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు తెలిపారు.

ఆటోలపై కేసులు రాయొద్దు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: గూడ్స్ ఆటోలపై కేసులు రాయడం ఆపాలని ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావుకు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఎగుమతి, దిగుమతుల కోసం గూడ్స్ ఆటోల వినియోగం తప్పని సరి అయినందున ముఠా కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్రావు, ఏడుకొండలు, కాశయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ రంగం కీలకం

చిట్టినగర్, న్యూస్‌టుడే: భారత దేశం అద్భుతమైన ప్రగతిని సాధించేందుకు కమ్యూనికేషన్ రంగం కీలకంగా నిలిచిందని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం ప్రొఫెసర్ నాగిని అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ‘యాంటీనా టెక్నాలజీస్’పై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. కళాశాల కార్యదర్శి అమరసుధీర్, కోశాధికారి రాఘవయ్య, ప్రిన్సిపల్ పతంజలిశాస్త్రి, ఈసీఈ విభాగాధిపతి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక

చిట్టినగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర రెజ్లింగ్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటుకున్నారని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో వి.నారాయణరావు తెలిపారు. ఇటీవల నున్న గ్రామంలో నిర్వహించిన అండర్-19 బాలుర రెజ్లింగ్ పోటీలలో ఎం.లక్ష్మీనారాయణ బంగారు పతకం సాధించగా, ఎం.బంగారురెడ్డి కాంస్య పతకం పొందినట్లు వివరించారు. విజేతలను కొత్తపేట కేబీఎన్ కళాశాలలో శుక్రవారం అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. లక్ష్మీనారాయణ ఈ నెల 23 నుంచి ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని ఏవో చెప్పారు. క్రీడా విభాగాధిపతి డి.హేమచంద్రరావు, ప్రిన్సిపల్స్ కృష్ణవేణి, విజయ్‌బాబు పాల్గొన్నారు.

విజయవాడ మధ్య

ప్రతిభకు పదును



శారద రామకృష్ణ విద్యాలయ విజేతలతో ప్రధానోపాధ్యాయుడు సాయిరామ్‌ప్రసాద్



నవోదయ నోబుల్ కిడ్స్ పాఠశాల విజేతలతో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి

గాంధీనగర్, న్యూస్‌టుడే: స్థానిక శారదా రామకృష్ణ విద్యాలయ పాఠశాలలో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభ, నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో బి.హర్షిత, ద్వితీయ స్థానంలో కె.తేజస్విని, తృతీయ స్థానంలో టి.రోషిణికుమారి నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సి.హెచ్.సాయిరామ్‌ప్రసాద్ బహుమతులు అందజేశారు.

చుట్టుగుంట, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో చుట్టుగుంట మారుతీనగర్‌లోని నవోదయ నోబుల్ కిడ్స్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీలో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీడీఎల్ ప్రసన్న ప్రథమ, పి.రిషిత ద్వితీయ, ఎం.దీరజ్ తృతీయ స్థానాల్లో నిలవగా, విజేతలకు పాఠశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు.

స్వచ్ఛత మాటలకే పరిమితమా..?



సెంట్రల్ తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణం ఇలా..



చెత్తా చెదారాలతో నిండి..

ఈ చిత్రంలో కనిపిస్తుంది విజయవాడ సెంట్రల్ తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణం. ఇది పిచ్చిమొక్కలు, చెత్తతో నిండిపోయింది. అభాగ్యులకు ఆవాసంగా మారింది. అధికారులు స్వచ్ఛభారత్ నినాదం ఇవ్వడమే కాని.. తమ కార్యాలయంలో అమలు చేస్తున్నట్లు కనిపించడం లేదు. నిత్యం వివిధ పనులతో ఎంతోమంది కార్యాలయానికి వస్తుంటారు. వారు ఇలాంటి పరిసరాలతో ఇబ్బంది పడుతున్నారు.

-ఈనాడు, అమరావతి

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గాంధీనగర్, సత్యనారాయణపురం, న్యూస్‌టుడే: లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా పూర్ణానందంపేట, హనుమాన్‌పేట, ఆంధ్రరత్న రోడ్డు, రైల్వేస్టేషన్, పాత ప్రభుత్వాసుపత్రి, తుమ్మలపల్లి కళాక్షేత్రం, లోటస్ ల్యాండ్‌మార్క్‌లో ఒకటి నుంచి మూడు సెక్టార్లు, ప్రధాన రహదారి, కేదారేశ్వరపేట జీరోలైను నుంచి ఐదోలైను వరకు, శాంతినగర్ ప్రాంతాల్లో కరెంటు ఉండదని వెల్లడించారు.

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 వరకు రెహమాన్ వీధి, శేషాద్రిశాస్త్రి వీధి, కోదండరామిరెడ్డి వీధి, యార్లగడ్డ వారి వీధి, రామమందిరం వీధి, వెంకటేశ్వరరావు వీధి తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని ఈఈ రవీంద్రబాబు తెలిపారు.

శ్రద్ధాంజలి



భువినుండి దివికేగిన అమృతమూర్తి
శ్రీమతి గుళ్ళపల్లి జ్యోత్స్న గార్కి
అశ్రునయనాలతో అంజలి ఘటిస్తూ...
అనుకోని అకాల మరణంతో
మరలిరాని లోకాలకు వెళ్ళిన
సంఘ జీవి, ఆదర్శ గృహిణి
శ్రీమతి గుళ్ళపల్ల జ్యోత్స్న గార్కి
నమస్సుమాంజలి సమర్పిస్తూ...

శ్రీమతి గుళ్ళపల్లి జ్యోత్స్న గారు
W/o సుంకర రాజేంద్రప్రసాద్ గారు

	కుదరవల్లి రాధాకృష్ణమూర్తి USA
కుదరవల్లి దేవీకుమారి USA	కుదరవల్లి శ్రీనివాసరావు USA
కుదరవల్లి రవికుమార్ USA	మల్లిపెద్ది చిత్త రంజన్ USA
కుదరవల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు విజయవాడ	కుదరవల్లి రాజ్యలక్ష్మి విజయవాడ
కుదరవల్లి శకుంతల, నాగ విజయదుర్గ శ్రావణి, USA	కుదరవల్లి రేఖాంచల విజయవాడ
మల్లిపెద్ది స్వరూపారాణి USA	రామా క్యాలెండర్ MFG కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్, విజయవాడ-7
శ్రావణి జ్యూయలర్స్ విజయవాడ.	శ్రావణి ఫైనాన్షియర్స్ విజయవాడ.
డా॥ గుమ్మడి పద్మ, USA	మల్లిపెద్ది సుధీర్ రంజన్ హైదరాబాద్
నిమ్మగడ్డ వెంకటరవిబాబు విజయవాడ	నిమ్మగడ్డ శ్రీతేజ, USA
కన్నెగంటి స్వరూపారాణి విజయవాడ	వల్లూరి నిర్మలాకుమారి విజయవాడ
వల్లూరి రంజిత్ కుమార్ USA	HPCL రీజనల్ ఆఫీస్ తాడేపల్లి
కె.పి.రావు గురునానక్‌నగర్, విజయవాడ.	బెల్లంకొండ నరసింహారావు వెంకటపాలెం
ప్రత్తిపాటి నాగమల్లేశ్వరరావు వెంకటపాలెం	రావి వెంకటనారాయణరావు వణుకూరు

వాంబేకాలనీలో ఉచిత వైద్యశిబిరం నేడు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్): వాంబేకాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి శిబిరం జరుగుతుంది. శిబిరంలో గుండె, ఎముకలు, మహిళలు, పిల్లలకు సంబంధించిన నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

అన్న సంతర్పణ

సీతారాంపురం: కస్తూరిబాయిపేటలో వేంచేసియున్న శ్రీముత్యాలమ్మ గుడి వద్ద దసరా నవరాత్రుల సందర్భంగా శుక్రవారం ముత్యాలమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహా అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు.

ప్రొఫెసర్ సాయిబాబాకు బీబీఏ నివాళి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: మానవ హక్కుల ఉద్యమకారుడు, విద్యావేత్త, రచయిత, దిల్లీ విశ్వవిద్యాలయ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబాకు బెజవాడ బార్ అసోసియేషన్ ఘనంగా నివాళులర్పించింది. బీబీఏ హాల్లో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన కార్యక్రమంలో బీబీఏ ఉపాధ్యక్షుడు శర్మ, ప్రధాన కార్యదర్శి ఆరిగెల శివరామప్రసాద్ తదితరులు సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు సాయిబాబా చేసిన ఉద్యమాలు, అణగారిన వారి హక్కుల కోసం చేసిన పోరాటాలను ప్రస్తావించారు. కార్యక్రమంలో అయ్యల రాంప్రసాద్, సంపత్ శ్రీనివాసరావు, విశాల్, బూసి సతీష్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో ఘంటసాల మహాసభలు

గాంధీనగర్: ఆలిండియా ఘంటసాల చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో గాంధీనగర్‌లోని కొత్తా కళావేదికలో రెండు రోజుల పాటు ఘంటసాల పాటలతో సినీ సంగీత విభావరి, రాష్ట్ర స్థాయి ఘంటసాల మహాసభలు జరుగుతాయని నిర్వాహకులు కోట వెంకటేశ్వరరెడ్డి, చింతకాయల చిట్టిబాబు, డేవిడ్‌రాజు, ఆంజనేయరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆటోలపై కేసులు రాయొద్దు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: గూడ్స్ ఆటోలపై కేసులు రాయడం ఆపాలని ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వన్‌ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావుకు వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఎగుమతి, దిగుమతుల కోసం గూడ్స్ ఆటోల వినియోగం తప్పనిసరి అయినందున ముఠా కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరారు. ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్రావు, ఏడుకొండలు, కాశయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కట్టడం తొలగింపుపై మల్లగుల్లాలు



గుడి పేరుతో నిర్మించిన షెడ్డు ఇదే

విజయవాడ, న్యూస్‌టుడే: మధురానగర్ ఏలూరుకాలువ గట్టుపై కొబ్బరితోట వద్ద ఏర్పాటు చేసిన గుడి తొలగింపుపై ప్రతిష్టంభన నెలకొంది. దసరా ఉత్సవాల అనంతరం ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు తొలగిస్తామంటూ నిర్వాహకులు పట్టణ ప్రణాళికాధికారులకు చెప్పగా స్థానిక తెదేపా నేత ఒకరు దీనికి హామీ ఇచ్చారు. దసరా ఉత్సవాలు ముగిసి వారం రోజులు గడుస్తున్నా షెడ్డును తొలగించకుండా ఉంచడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో విలువైన కాలువగట్టు స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు లోపాయికారీగా కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శిస్తున్నారు. కాగా నిర్వాహకులు అక్రమ కట్టడాన్ని తొలగించకుండా ఉంచాలంటూ రాజకీయ నేతల కార్యాలయాల చుట్టూ ప్రదిక్షణలు చేస్తుండటంతో తొలగిస్తారా లేదా అనే దానిపై ప్రతిష్టంభన నెలకొంది.

ఏర్పాట్ల పరిశీలన

నగరపాలక సంస్థ: ఇందిరాగాంధీ మున్సిపల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్న పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. క్రీడా ప్రాంగణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు.

జాతీయ పతక విజేతకు అభినందన



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: దుర్గాపురంలోని ఎస్‌టీవీఆర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలకు చెందిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సర్వజ్ఞను పలువురు అభినందించారని ప్రధానోపాధ్యాయిని ఎం.సూర్యప్రభ తెలిపారు. ఇటీవల హరియాణాలో జరిగిన 43వ జాతీయ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సర్వజ్ఞ మెరుగైన ప్రతిభ ప్రదర్శించడంతో జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకోవడంతో పాటు వ్యక్తిగతంగా రజత పతకాన్ని సొంతం చేసుకుందని పేర్కొన్నారు. శుక్రవారం సర్వజ్ఞ, స్కూల్ ఎస్ఎంసీ పీఈటీ జలసూత్రం వెంకట్రావులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన షేక్ బాజీ తండ్రి : షేక్ ఖాశిం మరియు రిజ్వానుల్లా బేగ్, తండ్రి : భాషార్తుల్లా బేగ్, నివాసం: విజయవాడ వారి సంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి పూర్వము దివాకరుని సుందర రామయ్యగారు క్రయదస్తావేజు నెం. 1935/1953 ద్వారా ఖమరున్నీసాబేగం సాహెబ్ నుండి కొనుగోలుచేసి అనుభవించుచూ ఇంటస్టేట్‌గా ది: 03.04.1975న మరణించిన పిదప వారల వారసులైన సుందరరామయ్య గారి కుమారుడైన రాధాకృష్ణశర్మ మరియు సోదరుడైన అరుణశైలశర్మ ది:14.10.2004న మరణించిన పిమ్మట వారల వారసులైన భార్య, పిల్లలు కలిసి సదరు ఆస్తులని విభజించుకొని విభాగపు దస్తావేజు నెం. 2929/2006 గా పటమట సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు రిజిష్టరు చేయించిన దర్మిలా సదరు పార్టీషన్ దస్తావేజులో తనకు వచ్చిన ఆస్తిపై హక్కును వదులుకొనుచూ, తన కుమారుడైన శ్యామ్‌సుందర్‌కు హక్కు విడుదల దస్తావేజు నెం.5686/2015గా వ్రాయించి ఇచ్చిన దర్మిలా సదరు శ్యామ్‌సుందర్ గారు నా క్లయింట్లతో విక్రయ అగ్రిమెంటు అయి కొంత మొత్తమును బయానాగా పుచ్చుకుని వున్న సందర్భమున నా క్లయింట్లు సుందరం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, విజయవాడ వారి లోను పొందుటకు సిద్ధముగా వుండి పై తెల్పిన సుందరరామయ్య, అరుణశైలశర్మ గార్ల మరణ, కుటుంబ సభ్యుల పత్రములను పొందుపరచలేకపోవు చున్నారు. కావున సదరు ఆస్తిపైగాని, వారసులపై గాని మరి ఏ యితర ఏ విధమైన అభ్యంతరములు వున్న యెడల ఈ ప్రకటన తేదీ నుంచి ఏడు రోజులలోపు రిజిష్టర్డ్ పోస్ట్‌ద్వారా దిగువ తెలుపబడిన అడ్రస్‌కు తెలియపరచగలరు. గడువు దాటి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును బైండు చేయజాలవు.
షెడ్యూల్: ఎన్‌టిఆర్‌జిల్లా పటమట సబ్ రిజిస్ట్రారు, గవర్నరుపేట, మద్దులపల్లివారివీధి, మున్సిపల్‌వార్డు నెం.23, రెవిన్యూవార్డు నెం.10, బ్లాక్ నెం. 5, ఎన్.టి.ఎస్.నెం. 231, డో.నెం.27-27-2 కి సంబంధించి 121 చ.గ.ల బహుళ అంతస్తుల కి హద్దులు: తూర్పు: మున్సిపల్ రోడ్డు, దక్షిణం: ఖాజా సత్యన్నారాయణ గారి ఆస్తి. పడమర: ఎల్‌ఐసి వారి ఆస్తి వెంబడి ఈ ఆస్తి ప్రహరీగోడ ఉత్తరం: మద్దులపల్లి సోమశేఖర శర్మ గారి ఆస్తి
CH.NLPV ప్రసాద్, అడ్వకేట్.
29-19-14,దోర్నకల్ రోడ్డు,విజయవాడ-2. సెల్:9390272545.

ఉచిత ఇసుక హామీ అమలు చేయండి



కృష్ణా హోటల్ సెంటరులో సీఐటీయూ నాయకులు, కార్మికుల ధర్నా

అజిత్‌సింగ్‌నగర్(మధురానగర్), న్యూస్‌టుడే: ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని సీఐటీయూ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును పని చేయించి పథకాలను కొనసాగించాలని కోరుతూ సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటరులో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ సెంట్రల్ కార్యదర్శి ఎం.బాబూరావు మాట్లాడుతూ విజయవాడలో 39 రకాల వృత్తుల్లో సుమారు లక్ష మందికి పైగా పనిచేస్తున్నారని తెలిపారు. అనేక పోరాటాల ద్వారా 2009లో సంక్షేమ బోర్డును సాధించుకున్నామని, 2019లో వైకాపా ప్రభుత్వం బోర్డు ద్వారా వచ్చే పథకాలను ఆపేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే బోర్డును పునరుద్ధరిస్తామని తెదేపా హామీ ఇచ్చిందన్నారు. ఉచితంగా ఇసుక కూడా ఇస్తామని చెప్పిందని, అధికారంలోకి వచ్చి 100 రోజులైనా ఆ హామీని అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో పవన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి



మాకు అత్యంత ఆప్తులు,
సన్నిహితులు, మా శ్రేయోభిలాషి
శ్రీ సుంకర రాజేంద్ర ప్రసాదు గారి సతీమణి
కీ॥శే॥ గుళ్ళపల్లి జ్యోత్స్న గారి
అకాల మరణానికి చింతిస్తూ... వారి పవిత్ర
ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ...
వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ
సానుభూతి తెలియజేస్తున్నాను.

కీ॥శే॥ గుళ్ళపల్లి జ్యోత్స్న గారు
మరణం: 08-10-2024

RAKESH BABU MYNENI
Advocate
M.G Road, Labbipet, VJA-10

నెల జీతం అదనంగా చెల్లించాలి



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

అజిత్‌సింగ్‌నగర్(మధురానగర్), న్యూస్‌టుడే: వరదల్లో శ్రమించిన పారిశుద్ధ్య కార్మికులకు ఒక నెల జీతం అదనంగా చెల్లించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం 59వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల్లో అనేక మంది కార్మికుల ఇళ్లు మునిగిపోయినా.. వారు విధులకు హాజరై పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. వారికి ఒక నెల జీతం అదనంగా చెల్లించడంతోపాటు కనీస వేతన చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.ఆర్.ఆంజనేయులు, బుద్దె రాజా, జెక్కి జేమ్స్, తుపాకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ది గాంధి కో-ఆపరేటివ్‌అర్బన్ బ్యాంకులిమిటెడ్, నెం.H.948

మ్యూజియం రోడ్డు, గవర్నరుపేట, విజయవాడ-2. Ph : 2433379,2436365.

ఏవి ఎలా ఉన్నవి అవి అలా అను ప్రాతిపదికన జరుగు బంగారు ఆభరణముల వేలము ప్రకటన

దిగువ బంగారు ఆభరణములు బకాయిదారులు బ్యాంకు ప్రధాన శాఖ నుండి పొందిన ఋణము తాలుక బకాయిల వసూలు నిమిత్తము బ్యాంకునకు తనఖా ఉంచబడిన క్రింది షెడ్యూలు నగలు ది. 25-10-2024 న ఉదయం 11-00 గం॥లకు ది గాంధి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్, మెయిన్ బ్రాంచ్, మ్యూజియం రోడ్డు, విజయవాడ నందు నిర్వహించబడు, సదరు బహిరంగ వేలములో అందరికన్న ఎక్కువ పాటదారుని పేర పాట కొట్టివేయబడి విక్రయించబడును.

వ. నెం.	బకాయి దారుడు	చిరునామా	బకాయి వివరములు (తదుపరి వడ్డీ + ఖర్చులు కలపబడును	తూకం (గ్రాములు)
1.	కాకి వెంకట బాలాజి	ప్లాట్ నెం.1942, రాజీవ్ నగర్, విజయవాడ	అప్పు నెం.000130311009195 ది.15-10-2024 నాటికి రూ. 65,280	21.200
2.	షేక్ సలీమ్	డోర్ నెం.24-17-22 బావాజిపేట, విజయవాడ	అప్పు నెం.000130311010306 ది.15-10-2024 నాటికి రూ. 64,673	19.200

వేలము పాటలో పాల్గొనువారు రూ.5000/- ధరావత్తు సొమ్ము చెల్లించి వ్యక్తిగత ధృవీకరణములు (పాన్ & ఆధార్) సమర్పించవలెను. ఏ కారణము తెలుపకుండా వేలమును నిలిపివేయు హక్కు బ్యాంకు వారికి కలదు. వేలము యొక్క ఇతర వివరములు మరియు నిబంధనలను గూర్చి బ్యాంకు నందు సంప్రదించవచ్చును. వేలము వేయబడు నగలను పాటదారులు బ్యాంకు పనివేళలలో పరిశీలించు కొనవచ్చును. విక్రయం అనంతరము ఆభరణముల తూకములు మరియు ఖచ్చితత్వములకు బ్యాంకు వారికి సంబంధము లేదు.

విజయవాడ, తేది : 18-10-2024 బ్రాంచ్ మేనేజర్

గంజాయి బ్యాచ్ కదలికలపై నిఘా

మధురానగర్, న్యూస్‌టుడే: గంజాయి, బ్లేడ్‌బ్యాచ్ కదలికలపై గుణదల పోలీసులు గట్టి నిఘా ఉంచారు. గంజాయి తాగేందుకు వ్యసనపరులు స్థావరాలుగా వినియోగిస్తున్న నిర్మానుష్య ప్రాంతాలను శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైల్వే ట్రాక్ పరిసరాలతో పాటు నగర శివారు ప్రాంతాల్లో సీఐ వాసిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

అంతిమయాత్ర



శ్రీమతి పిన్నమనేని లీల గారు
ది. 18-10-2024
శుక్రవారం
స్వర్గస్థులైనారని
తెలియజేయుటకు
చింతిస్తున్నాము.
శోకతప్త హృదయాలతో..

శ్రీమతి పిన్నమనేని (కోనేరు) లీల గారు
Retd. ప్రధానోపాధ్యాయిని,
చిల్డ్రన్స్ మాంటిసోర్రి
ప్రాథమిక పాఠశాల, విజయవాడ
జననం: 15-7-1945, మరణం: 18-10-2024

భర్త
పిన్నమనేని రామారావు
మరియు
కుటుంబ సభ్యులు

అంతిమయాత్ర : ది. 19-10-2024 శనివారం ఉ॥ 9 గంటలకు విజయవాడ సూర్యారావుపేటలోని మా స్వగృహము నుండి బయలుదేరును. ✆ 93921 31746

ఆవిడ కోరిక మేరకు పార్థివ దేహమును పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజికి ఇవ్వడమైనది

చికిత్స పొందుతూ మృతి

పాయకాపురం(మధురానగర్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. నున్న పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కండ్రికకు చెందిన వర్రి వెంకట్రావు (57) లారీ డ్రైవర్.. గురువారం రాత్రి 8.15 గంటల సమయంలో ఆయన ద్విచక్ర వాహనంపై వెళుతూ కింద పడిపోయారు. తలకు బలమైన గాయం కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. దీనిపై మృతుడి భార్య కృష్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురుగు ముంచెత్తుతోంది..!



సీతారాంపురం: సీతారాంపురం కూడలి నుంచి పుష్పా హోటల్ మీదుగా మహాత్మా గాంధీ రోడ్డుకు వెళ్లే వేముల శ్యామలాదేవి రోడ్డులో బ్రహ్మానందం హాస్పటల్ వద్ద భూగర్భ డ్రెయినేజీ పొంగి మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు చేసేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

జ్యోత్స్నాంజలి



శ్రీమతి గుళ్ళపల్లి జ్యోత్స్న గారు

ది. 08-10-2024న మన నుండి భౌతికంగా దూరమైనారు.
ఆమెతో మన జ్ఞాపకాలను, ఉద్యమస్మృతులను
ఆత్మీయులందరం కలసి పంచుకుందాం.

స్థలం: C.K.కన్వెన్షన్, డి.జి.పి.ఆఫీస్ ప్రక్కన, మంగళగిరి
తేదీ: 19-10-2024 సమయం: ఉదయం 10.30 గంటల నుండి

ఇట్లు
సుంకర రాజేంద్రప్రసాదు, న్యాయవాది
సుంకర అశీష్, ప్రీతి సుంకర అనీష్, సాయి ప్రశాంతి
రిషన్, స్వేయ, రియాన్

తొమ్మిది పతకాల ఎంబీబీఎస్



‘డబ్బు తీసుకోకుండా వైద్యం చేసి, మా ప్రాణాలు కాపాడారు. మీరు చల్లగా ఉండాలమ్మా’ అంటూ వైద్యురాలైన తన తల్లితో ఓ పేద మహిళ చెప్పింది. అది చూసి ‘నేనూ డాక్టరు కావాలి’ అనుకున్నాడు **అత్తలూరి సాయి అనిరుధ్**. ‘ఆ వృత్తికి వేళాపాళలుండవు. ప్రయాస ఎక్కువ’ అని, దగ్గరివాళ్లు చెప్పినా వినలేదు. ఏకంగా తొమ్మిది బంగారు పతకాలతో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు.

టాపర్ కావడం అంటే మాటలు కాదు. ముందు చదువుపై విపరీతమైన ఇష్టం ఉండాలి. తీవ్రమైన పోటీ ఎదుర్కోవాలి. అయితే కాకినాడ కుర్రాడు అనిరుధ్ మాత్రం దీనికోసం మరీ త్యాగాలేం చేయలేదు. తనకున్న స్నేహితులంతా చదువు, సబ్జెక్టుపై ప్రాణం పెట్టేవాళ్లే. అదీగాక అనిరుధ్ సీనియర్ ప్రొఫెసర్లు, ఆయా సబ్జెక్టుల నిపుణులతో ఎక్కువగా సావాసం చేసేవాడు. ఏ సందేహాలున్నా అడిగిమరీ తీర్చుకునేవాడు. డా.కాకర్ల సుబ్బారావు, డా.కిమ్ రామస్వామిలాంటి దిగ్గజ వైద్యుల సలహాలు తీసుకునేవాడు. తల్లిదండ్రులిద్దరూ వైద్యులే. అప్పుడప్పుడు నాన్నతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తూ రోగుల ఇక్కట్లు గమనించేవాడు. పైగా తనకి గ్రాహకశక్తి ఎక్కువ. సహాధ్యాయుల తోనే కాకుండా ఇతర పాఠశాలలు, కాలేజీలు, ఇతర రాష్ట్రాల్లోని టాపర్లతోనూ పోటీ పడేవాడు. అదే ఊపుతో సీబీఎస్ఈలో పదోతరగతిలో పాఠశాల టాపర్‌గా నిలిచాడు. ఇంటర్‌లో తూర్పు గోదావరి జిల్లా ఫస్ట్ వచ్చాడు. ఎంబీబీఎస్‌లో అయితే తన ప్రతిభ శిఖరస్థాయికి చేరింది. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్‌లలో విశ్వవిద్యాలయ పరిధిలో మేటిగా నిలవడమే కాదు.. తొమ్మిది పసిడి పతకాలతో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం టాపర్ అయ్యాడు. ప్రస్తుతం హౌస్‌సర్జన్ శిక్షణలో ఉన్న అనిరుధ్ న్యూరో సర్జన్ లేదా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా మారి, పేదలకు చేతనైన సాయం చేస్తాను అంటున్నాడు.

- చిరంజీవులు కరిమి, కాకినాడ

- మంగళగిరి అఖిల భారత వైద్య విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్)లో కొలక్విమ్-2020 సదస్సులో స్వర్ణం.
- విశాఖపట్నం ఆంధ్ర వైద్య కళాశాల జాతీయస్థాయి అనాటమీ సెమినార్‌లో గోల్డ్ మెడల్.
- ఉస్మానియా వైద్య కళాశాల హైదరాబాద్‌లో నిర్వహించిన దేశవ్యాప్త యూజీ కాన్ఫరెన్స్ ఓస్మెకాన్- 2021 పత్ర సమర్పణలో మొదటి బహుమతి.
- వైద్యశాస్త్రంలో చాట్ జీపీటీ, ఇతర ఏఐ వ్యవస్థల ప్రభావం, వాటి సవాళ్లపై రాసిన విశ్లేషణ ప్రఖ్యాత జాన్స్ హాప్కిన్స్ మ్యాగజైన్‌లో సమీక్షించారు. ఫ్రంటియర్స్ ఇన్ ఏఐ జర్నల్‌లో ప్రచురితమైంది.

‘సిమ్మర్ డేటింగ్’ తరం!



చాటింగూ.. డేటింగూ.. నచ్చితేనే వెడ్డింగూ.. లేదంటే రిలేషన్ షిప్‌కి ఎండింగూ.. ఇప్పుడిదే కదా ట్రెండింగూ! కానీ, జనరేషన్ జెడ్ మాత్రం తాము అలా కాదంటోంది. నేరుగా రొమాన్స్‌లోకి దిగిపోకుండా ఎమోషనల్‌గా కనెక్ట్ కావడమే ముఖ్యమంటోంది. దీన్నే ‘సిమ్మర్ డేటింగ్’ అంటున్నారు. మెట్రో, ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఇటీవల ఓ డేటింగ్ యాప్ చేసిన సర్వేలో దాదాపు 47శాతం మంది ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారట. పరిచయం కాగానే డిన్నర్లూ, టూర్లూ అనకుండా.. ఒకరినొకరు అర్థం చేసుకునేందుకు, ఓపికగా తగిన సమయం తీసుకుంటున్నారట. అభిరుచులు కలిసి, నమ్మకం కుదిరి, తమకు సరిజోడు అనుకున్నాకే ముందడుగు వేస్తున్నామని సెలవిచ్చారు. కొద్దిరోజుల్లో ముగిసిపోయే బంధం కంటే మనసుతో ముడిపడి, ఎక్కువ కాలం నిలిచే అనుబంధాలకే ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఆకర్షణతో వచ్చే ఇన్‌స్టంట్ కెమిస్ట్రీ వద్దనీ.. భాగస్వామిపై నమ్మకం కుదిరాకే డేటింగ్‌కి ఓకే చెబుతున్నారు.

ఐదు కొలువుల విజేత

‘అంత చదువూ చదివి టీకొట్టు పెట్టుకొని బతుకుతావా?’ అంటూ ఎగతాళి చేశారెందరో. కానీ కాలం కలిసిరానప్పుడు తగ్గి ఉండటంలో తప్పు లేదని భావించాడు **ఉడాన్ శివమహేశ్ కుమార్**. తర్వాత ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. అప్పుడు చులకనగా చూసినవాళ్లే ఇప్పుడు ‘శెభాష్’ అంటున్నారు.



పెద్దపల్లి జిల్లా ధర్మారంలో శివమహేశ్ కుమార్ పేరు ఆరునెలల నుంచి మార్మోగిపోతోంది. ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే గగనమైన ఈ రోజుల్లో తను వరుసపెట్టి సర్కారీ కొలువులు కొడుతూనే ఉన్నాడు. గతేడాది గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో అతడి విజయయాత్ర మొదలైంది. టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్.. తాజాగా డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించి జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. మహేశ్‌కి మొదట్నుంచీ హిందీ సబ్జెక్టు అంటే విపరీతమైన ఆసక్తి. దాంతో ఎం.ఎ. హిందీ చదివి, హిందీ పండిత్ శిక్షణ కూడా పూర్తి చేశాడు. మూడేళ్లు ప్రైవేటు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేశాడు. కానీ అత్తెసరు జీతం కావడంతో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదల మొదలైంది. సాయంత్రం దాకా విధులు నిర్వర్తించి, అర్ధరాత్రి వరకు టీచరు ఉద్యోగానికి సిద్ధమయ్యేవాడు. అలా సన్నద్ధమవుతూనే 2017లో డీఎస్సీ రాశాడు. జిల్లాస్థాయిలో రెండో ర్యాంకుతో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైనా, కోర్టు కేసుల కారణంగా ప్రభుత్వం నియామకాలు జరపలేదు. అయినా అధైర్య పడకుండా ఇతర ఉద్యోగాల కోసం సాధన ప్రారంభించాడు.

ఓ మోస్తరుగా గడిచి పోతున్న అతడి జీవితాన్ని కరోనా అతలాకుతలం చేసింది. పని చేస్తున్న స్కూల్ మూతపడటంతో ఉపాధి కరవైంది. దాంతో కుటుంబం గడవడానికి పక్క ఊరిలో చాయ్ దుకాణం తెరిచాడు. అప్పుడు చాలామంది రకరకాలుగా మాట్లాడారు. అయినా అదేమీ పట్టించుకోలేదు. సాయంత్రం వరకు టీపాయింట్ నడిపి, ఆ తర్వాత చదువుకునేవాడు. ఆపై ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటన రావడంతో 2023 జనవరిలో కరీంనగర్ వెళ్లాడు. డబ్బులకు ఇబ్బంది ఉండటంతో మిత్రుడి గదిలో ఉంటూ, ఐదు రూపాయల భోజనంతో సరిపెట్టుకుంటూ ప్రిపేర్ అయ్యేవాడు. తర్వాత తను రాసిన ప్రతి పరీక్షలోనూ విజయం సాధించాడు. ప్రస్తుతం జూనియర్ లెక్చరర్ కొలువులో చేరినా, గ్రూప్-1 ఉద్యోగమే తన లక్ష్యమంటున్నాడు.

- చల్లారం రామచంద్రారెడ్డి, కరీంనగర్ డెస్క్


■ youthpage@eenadu.in

ఈతరం

గొడవ పడటమే హీరోయిజమా?

నేనొక అమ్మాయిని ప్రేమించా. ఏడాది వరకు బాగానే ఉంది. ఈమధ్యే విచిత్రంగా ప్రవర్తిస్తోంది. బైక్‌పై విన్యాసాలు చేస్తూ రీల్స్ చేద్దాం అంటోంది. కావాలనే వేరే అబ్బాయిలను రెచ్చగొడుతోంది. వాళ్లు తనని ఏమైనా కామెంట్ చేస్తే, నేను వెళ్లి వాళ్లని చితక్కొట్టాలట! అలా చేయకపోతే ‘నీకేదీ చేతకాదు.. హీరో లక్షణం ఒక్కటీ లేద’ని దెప్పి పొడుస్తోంది. దుస్సాహసాలు, అనవసర గొడవలకు వెళ్లకుండా ఉంటే చేతకానితనమా? తనకెలా చెప్పాలి?

- రాజ్, ఈమెయిల్



ఏడాది క్రితం వరకు బాగానే ఉన్న అమ్మాయిలో ఒక్కసారిగా మార్పు రావడానికి కారణమేంటో తెలుసుకున్నారా? బైక్‌పై వెళ్తూ రీల్స్ చేయాలనడం, ఇతరులతో గొడవ కోరుకోవడం ఆమెలో మానసిక పరిణతి లేదనే విషయం సూచిస్తోంది. ఆమె ఊహా లోకంలో విహరిస్తోంది. ఇంతకీ తన వయసెంతో చెప్పలేదు. సామాజిక మాధ్యమాల అతి వాడకం, స్నేహితుల ప్రభావం కారణంగా బహుశా తను అలా ప్రవర్తిస్తూ ఉండొచ్చు. తన స్నేహితుల్లో ఈ తరహా మనస్తత్వం ఉన్నవాళ్లకి దూరంగా ఉంచండి. ఇలాంటి పిచ్చి ఆలోచనలు రాకుండా.. తనకి ఎప్పుడూ ఏదో ఒక వ్యాపకం ఉండేలా జాగ్రత్త పడాలి. ప్రమాదకరమైన రీల్స్ చేస్తూ కొంతమంది ప్రాణాలు కోల్పోవడం చూస్తూనే ఉన్నాం. ఇలా చేస్తే చట్టపరంగానూ చిక్కుల్లో పడతారు. ఈ విషయం తనకి అర్థమయ్యేలా చెప్పండి. ఇక ఇతరులతో గొడవ పడటం హీరోయిజం కాదు. దీన్ని ఎవరూ హర్షించరు. ఇవన్నీ చెప్పినా కూడా ఆ అమ్మాయి మారకపోతే తనకి దూరంగా ఉండటమే మంచిది. దుస్సాహసాలు, గొడవలతో అనవసరంగా ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. ఆల్ ది బెస్ట్.



- డా.అర్చన నండూరి, క్లినికల్ సైకాలజిస్ట్

సొగసరి.. ఈవీహికిల్!

ఇప్పుడిప్పుడే ఈవీ బైకల హవా మొదలవుతోంది. సరికొత్త ఫీచర్లు, అదిరిపోయే డిజైన్‌తో కుర్రకారును ఆకట్టుకునేలా మోడళ్లను విపణిలోకి దించుతున్నాయి తయారీ కంపెనీలు. ఆ వరుసలోనే వచ్చింది ‘టీ 30’.



చెన్నైకి చెందిన రాప్‌టీ.హెచ్‌వీ అనే స్టార్టప్ దీన్ని తయారు చేసింది. పెట్రోల్‌తో నడిచే 250-300 సీసీ బైక్‌లతో పోటీ పడగల సామర్థ్యం దీని సొంతమంటోంది. దీన్ని దేశంలోనే హైవోల్టేజీ ఈవీగా పేర్కొంటోంది.

- ఎలక్ట్రిక్ కార్లలో ఉపయోగించే శక్తిమంతమైన బ్యాటరీని ఈ బైక్‌కి అమర్చారు. కార్ల ఛార్జింగ్ స్టేషన్లలో రీఛార్జ్ చేసుకోవచ్చు. 5.4 కేడబ్ల్యూహెచ్ సామర్థ్యం ఉండే ఈ బ్యాటరీని ఛార్జ్ చేసి, 150 కిలోమీటర్లు ప్రయాణం చేయొచ్చు.
- 3.5 సెకన్లలో బండి 60 కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. ఐపీ-67 రేటెడ్ బ్యాటరీ ప్యాక్‌కి ఎనిమిదేళ్లు లేదా 80 వేల కిలోమీటర్ల వరకూ వారంటీని ఇస్తున్నారు. ● ధర రూ.2.39 లక్షలు (ఎక్స్ షోరూం).

కిరాయి డ్రైవర్ నుంచి గంజాయి స్మగ్లర్‌గా మారి..

వెంట తెచ్చుకున్న లోడ్ చేసిన తుపాకీ

ముఠాని పట్టుకున్న పోలీసులు



గంజాయి ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న తుపాకీ, బుల్లెట్లు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ మహేశ్వరరాజు, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, పటమట సీఐ పవన్ కిషోర్

పటమట, న్యూస్‌టుడే: అంతర్ రాష్ట్ర ముఠా లోడ్ చేసిన తుపాకీ వెంట తెచ్చుకొని గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు చిక్కింది. పోలీసుల కంట పడకుండా నర్సీపట్నం నుంచి విజయవాడ మీదుగా చెన్నైకి పలుమార్లు గంజాయి తీసుకెళ్తున్న ముఠాని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. ఆ వివరాలను శుక్రవారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లో డీసీపీ మహేశ్వరరాజు, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్ మీడియాకు వెల్లడించారు. చెన్నై పద్మనాభనగర్‌కు చెందిన రమేష్ వినేష్ కుమార్‌కు అదే నగరానికి చెందిన గంజాయి వ్యాపారి శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన గంజాయి వ్యాపారి దుర్గా నుంచి శ్రీనివాస్ సరకు తెప్పించి చెన్నైలో విక్రయిస్తుంటాడు. తుని నుంచి చెన్నైకి గంజాయి తీసుకెళ్తే... వినేష్‌కు రూ.25 వేలు ఇచ్చేలా ఇద్దరూ ఒప్పందం చేసుకున్నారు. దుర్గా నర్సీపట్నంలో వినేష్ వాహనంలో సరకు ఎక్కించేవాడు. అలా పలుమార్లు గంజాయి తీసుకెళ్లాడు. గతేడాది పోలీసులకు దొరికాడు. దుర్గాతో పాటు వినేష్ జైలు శిక్ష అనుభవించాడు.

నంబర్ ప్లేట్లు మార్చి..

కిరాయి డ్రైవర్‌గా గంజాయి చేరవేసే కంటే తానే స్మగ్లింగ్ చేస్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో వినేష్ కారు కొన్నాడు. పలుమార్లు గంజాయి చెన్నైకి తీసుకెళ్లాడు. ఈ నెల 16న తమిళనాడుకు చెందిన కుమారన్ మరిమూర్తితో కలిసి వినేష్ చెన్నై నుంచి కారులో తుని వచ్చాడు. గురువారం దుర్గా తీసుకువచ్చిన 150 కిలోల గంజాయిని తన కారులో లోడ్ చేసుకున్నాడు. కారుకు ఏపీ నంబర్ ప్లేట్ అతికించాడు. విషయం తెలుసుకున్న కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు విజయవాడ సీపీకి సమాచారం ఇచ్చారు. ఆయన ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఆ బృందం విజయవాడలో వాహనాన్ని పట్టుకొని సరకుతో పాటు లోడ్ చేసిన తుపాకీ స్వాధీనం చేసుకుంది.

బిహార్‌లో తుపాకీ కొని..

వినేష్ తరచూ బెంగళూరు వెళ్లేవాడు. బిహార్‌కు చెందిన ధర్మచంద్‌తో అతనికి పరిచయమైంది. అతని సహాయంతో పట్నా వెళ్లి అక్కడున్న సునీల్‌తో కలిసి రూ.75 వేలకు తుపాకీ కొన్నాడు. గతంలో వినేష్ ఇటుకల వ్యాపారం చేసేవాడు. భాగస్వాములతో గొడవలున్నాయి. వారు పలుమార్లు ఇతనిపై దాడి చేశారు. ఆ నేపథ్యంలో వినేష్ తుపాకీ వెంట తెచ్చుకున్నాడు. అయితే తుపాకీ లోడ్ చేసి ఉండటాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు.

అతిథులు మెచ్చేలా.. ఆహ్లాదం పంచేలా..

విజయవాడ విమానాశ్రయం జాతీయ రహదారికి కొత్త కళ

సుందరీకరణ పనులకు శంకుస్థాపన




సుందరీకరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎండీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రాజధాని అమరావతిలో కీలకం కానున్న విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విజయవాడ నగర శివారు రామవరప్పాడు వరకు పచ్చదనం నిండేలా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. 13 కిలోమీటర్ల మేర రెండేళ్ల వ్యవధితో రూ.6.48కోట్లతో ఏపీ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రామవరప్పాడు నుంచి కేసరపల్లి వరకు జరుగుతున్న సుందరీకరణ పనులను మరో రూ.2 కోట్లతో గన్నవరం చిన్నఅవుటపల్లి వరకు విస్తరించనున్నారు. ఆ పనులకు గన్నవరం మండలం కేసరపల్లి ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాల వద్ద శుక్రవారం కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి, జీఎం దయాకర్‌బాబు, ఆర్కిటెక్ట్ సత్యనారాయణ, ఎన్‌హెచ్‌ఏఐ పీడీ శ్రీధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విమానాశ్రయానికి ఎంతోమంది పారిశ్రామికవేత్తలు, ఇతర ప్రముఖులు వస్తుంటారని వారిని ఆకర్షించడంతో పాటు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. తొలివిడత పనులను పదిహేను రోజుల్లో పూర్తిచేయనున్నట్లు చెప్పారు.

పారిశ్రామికవాడతో ఉపాధి అవకాశాలు..

మల్లవల్లి పారిశ్రామికవాడలో ఎకరా రూ.16.5 లక్షల చొప్పున ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయించేందుకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఏర్పాటయ్యే 426 పరిశ్రమలు 18 నెలల్లో యూనిట్ పనులు ప్రారంభించకుంటే భూములు వెనక్కి తీసుకునేందుకు ప్రభుత్వం వెనుకాడదన్నారు. పారిశ్రామికవాడ వృద్ధితో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. విమానాశ్రయం ఎదుట ప్రభుత్వ భూమిలో ప్రముఖుల కోసం సర్కార్ అతిథిగృహాలు, కన్వెన్షన్‌ల నిర్మాణంపై సీఎంతో చర్చించినట్లు యార్లగడ్డ వెల్లడించారు. కార్యక్రమంలో వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ కిశోర్, డీపీవో అరుణ, పంచాయతీ, రెవెన్యూ అధికారులతో పాటు కిసాన్ మోర్చా రాష్ట్రాధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌నకు రాష్ట్ర బృందం



క్రీడాకారులతో రాష్ట్ర సంఘం కార్యదర్శి రామస్వామి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గోవాలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే జాతీయ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రం నుంచి 23 మంది పురుషులు, ముగ్గురు మహిళలతో కూడిన బృందం తలపడుతుందని రాష్ట్ర పారా స్పోర్ట్స్ సంఘం కార్యదర్శి వి.రామస్వామి తెలిపారు. పోటీకి వెళ్తున్న ప్రతి స్విమర్‌నూ శాప్ ఎండీ పీఎస్ గిరీషా, రాష్ట్ర పారా స్పోర్ట్స్ సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు అభినందించారు.

20న ఎస్‌జీఎఫ్ జిల్లా సైక్లింగ్ జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-19 శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నున్నలోని జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో బాలబాలికల సైక్లింగ్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత తెలిపారు. పదో తరగతి ఒరిజినల్ మార్కుల జాబితాతో పాటు కళాశాల/ పాఠశాల ప్రిన్సిపల్/ ప్రధానోపాధ్యాయుడు సంతకం చేసిన స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 94401 12455 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఓపెన్ పది, ఇంటర్‌కు దరఖాస్తు గడువు 25

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా 2024-25 విద్యా సంవత్సరంలో ఓపెన్ పది, ఇంటర్‌లో చేరడానికి ఈ నెల 25 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సమన్వయకర్త ఎన్.బాబురావు తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 26 నుంచి 29 వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 30 నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

పరీక్షా ఫలితాల విడుదల

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కృష్ణా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని డిగ్రీ కోర్సు వన్‌టైం అపర్చ్యునిటీ పరీక్షా ఫలితాలను ఉపకులపతి ఆర్.శ్రీనివాసరావు ఆదేశాలతో శుక్రవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.వీరబ్రహ్మాచారి ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలకు సంబంధించిన పూర్తి వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

టన్ను చెరకు ధర రూ.3,576

ఉయ్యూరు, న్యూస్‌టుడే: 2024-25 సీజన్‌కు గాను చెరకు ధర టన్నుకు రూ.3,576 ధర ఇస్తున్నట్లు కేసీపీ కర్మాగారం యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ అన్నారు. ఉయ్యూరులోని కర్మాగారంలో చెరకు రైతు సంఘం నాయకులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌కు రాయితీతో కలిపి టన్నుకు రూ.3,576, యాంత్రీకరణకు అనువుగా సాగుచేసిన రైతులకు సబ్సిడీతో కలిపి టన్నుకు రూ.3,676 చెల్లించనున్నట్లు వెల్లడించారు. గత నెలలో వచ్చిన అకాల వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులకు చెరకు రైతు సంఘం విజ్ఞప్తి మేరకు రూ.40.89 లక్షలు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. రానున్న సీజన్‌కు ఈ సంవత్సరం నవంబరు నుంచి 2025 సంవత్సరం ఫిబ్రవరి వరకు నాటే చెరకు మొక్క తోటలకు ఎకరానికి రూ.10 వేలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. సబ్సిడీతో పాటు సంప్రదాయ పద్ధతుల్లో నాటిన చెరకు తోటలకు టన్నుకు రూ.400 లేదా యాంత్రీకరణ అనువుగా వేసిన తోటలకు టన్నుకు రూ.500 సబ్సిడీగా ప్రకటించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగాల పేరుతో మోసం

భవానీపురం, న్యూస్‌టుడే: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ముగ్గురు వ్యక్తులు తమను మోసం చేశారంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి... భవానీపురానికి చెందిన అహ్మద్, వెంకటరమణ, మరో వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ తమ వద్ద రూ.30 లక్షలు పైగా వసూలు చేసినట్లుగా బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు తీసుకుని ఎంతకీ సమాధానం చెప్పకపోవడంతో నిందితులను శుక్రవారం రాత్రి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై భవానీపురం పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



హైజంప్‌లో క్రీడాకారుడు



హర్డిల్స్‌లో సత్తా చాటుతూ..

ఏ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం 32 పతకాలతో తమిళనాడు అగ్రస్థానంలో, తరవాత స్థానంలో కర్ణాటక ఉంది. ఆతిథ్య జట్టు 8 పతకాలు సాధించింది. తెలంగాణ 10 పతకాలతో రాణించింది. ★ అండర్-20 పురుషుల 200 మీటర్ల పరుగు పందెంలో ఏపీ క్రీడాకారుడు శెట్టి లోహిత్ మూడో స్థానంలో నిలిచారు. ఇదే విభాగంలో 3వేల పరుగుపందెం పోటీలో చంద్రశేఖర్ ప్రసాద్ బంగారు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. డిస్కస్ త్రోలో వికాస దాసరి రెండో స్థానంలో నిలిచారు. 400 మీటర్ల రిలే పరుగు పందెంలో తెలంగాణ క్రీడాకారులు రెండో స్థానంలో నిలవగా..ఏపీ మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఇదే విభాగంలో మహిళల 400 మీటర్ల రిలే పరుగు పందెంలో ఏపీ క్రీడాకారిణులు మూడో స్థానంలో నిలిచారు. ★ అండర్ 18 పురుషుల విభాగం 200 మీటర్ల పరుగు పందెంలో శేషు దుడ్డు, 1000 మీటర్ల పరుగుపందెంలో వెంకటరత్నం రెడ్డి ప్రథమ స్థానంలో నిలిచారు. తెలంగాణకు చెందిన మహేష్ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అండర్ -18 మహిళల హెప్టథ్లాన్ పోటీలో తెలంగాణ క్రీడాకారిణి శ్రీతేజ మొదటి స్థానం, అండర్-16 బాలుర విభాగం 600మీటర్ల పరుగు పందెంలో మస్తాన్ రెండో స్థానం, ఇదే విభాగంలో 80 మీటర్ల హర్డిల్స్‌లో ఏపీ, తెలంగాణ క్రీడాకారులు మూడు పతకాలను సాధించారు. ఏపీకి చెందిన ధనుష్ తేజా మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా మిగిలిన రెండు స్థానాలలో తెలంగాణకు చెందిన సయ్యద్ తాజీం, అన్షు యాదవ్ నిలిచారు. ఇదే విభాగంలో బాలికల లాంగ్ జంప్‌లో వైశాలి మొదటి స్థానం సాధించారు. అండర్-14 బాలుర విభాగంలో నిర్వహించిన ట్రైథ్లాన్‌లో తెలంగాణ క్రీడాకారుడు రాథోడ్ కార్తీక్ మొదటి, ఏపీ క్రీడాకారుడు ధనుష్ రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారు.

అంతర్జాతీయ ఓపెన్ చెస్ విజేత లలిత్‌బాబు



విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: థాయ్‌లాండ్‌లో ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు జరిగిన పట్టాయ శ్రీరచా ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్-2024లో నగరానికి చెందిన గ్రాండ్ మాస్టర్ ముసునూరి రోహిత్ లలిత్‌బాబు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకున్నాడు. తొమ్మిది రౌండ్లకుగాను ఏడు పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ టోర్నీలో ఈజిప్టు దేశానికి చెందిన ఒక జీఎం (గ్రాండ్ మాస్టర్), ఇద్దరు ఐఎం (ఇంటర్నేషనల్ మాస్టర్), ఒక సీఎం (కాండిడేట్ మాస్టర్)తో డ్రా చేసుకోగా.. అయిదుగురు క్రీడాకారులపై విజయం సాధించి మొత్తం ఏడు పాయింట్లతో విజేతగా నిలిచాడు.